Sharp News
తెలుగు జాతీయ
దినపత్రికలో ప్రకటనల
కోసం సంప్రదించండి
V.V. Sharma,
Editor - Mob No:
8466099201



# షార్ప్ న్యూస్
జాతీయ తెలుగు దినపత్రిక
ఎడిటర్ : వూటుకూరు వేంకటేశ్వర శర్మ
సోమవారం, ఏప్రిల్ 14, 2025 వెల: 5 రూ/.
సంపుటి: 12 సంచిక: 127, పేజీలు - 08



విలేకరులు కావలెను
(Part Time/Full Time)
రెండు తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలకు విలేకరులు కావలెను
అర్హతలు : తెలుగులో రాయడం రావాలి. సమాజం మీద అవగాహన ఉండాలి.
Send your Resumes to : Whats app No: 8985483063 (Don't call)
mail id :sharpnews2012@gmail.com



CIRCULATED FROM HYDERABAD, NALGONDA, KARIMNAGAR, WARANGAL, KHAMMAM, VIJAYAWADA, VISAKHAPATNAM, NELLORE


## నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు

### - సీఎం రేవంత్ రెడ్డి

**- ఉన్నతస్థాయి సమీక్షలో కీలక ఆదేశాలు**



**హైదరాబాద్ షార్ప్ న్యూస్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొదటి దశలో అత్యంత నిరుపేదలకు, అర్హులైన వారికే ఇళ్ళు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ పథకం పూర్తిగా పారదర్శకంగా, న్యాయంగా అమలవ్వాలని సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి అధికారులకు కీలక సూచనలు చేశారు. గ్రామ స్థాయిలో ఏర్పాటైన ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా పని చేయాలని, వాళ్ళు తయారు చేసిన జాబితాను తహశీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్‌లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి ధృవీకరించాలని సూచించారు. అనర్హులకు ఇండ్లు కేటాయించినట్లు తేలితే, వెంటనే ఆ విషయం కమిటీకి తెలియజేయాలని వాటిని రద్దు చేస్తామన్నారు. పథకంలో ఎలాంటి అవకతవకలు జరక్కుండా చర్యలు తీసుకోవాలనీ, అక్రమాలకు పాల్పడినవారిపై వెంటనే కేసులు నమోదు చేసి, చట్టపరంగా నిధులను తిరిగి వసూలు చేయాలని సీఎం ఆదేశించారు.

2లో..

## ఓల్డ్ సిటీలో మెట్రో పనులు వేగవంతం

**- రూ.212 కోట్ల నష్టపరిహారం పంపిణీ**

2లో..



## జానారెడ్డి ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారు

2లో..



## ఉగ్ర కుట్ర సరిహద్దులు దాటింది

**- దేశంలోని పలు నగరాలు టార్గెట్**



**న్యూఢిల్లీ** 26/11 ముంబై ఉగ్ర దాడిలో తహవ్వూర్ రాణా పాత్రను నిరూపించేందుకు తగిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి అరెస్టు చేసేందుకు ప్రధాన నిందితుల్లో తహవ్వూర్ రాణా ఒకడని వెల్లడించింది. ఉగ్రదాడి కుట్ర దేశం దాటి వ్యాపించిందని పేర్కొంది. దేశ రాజధాని సహా దేశంలోని అనేక నగరాలను టార్గెట్ చేశారని దర్యాప్తు ద్వారా గుర్తించాలని కోరినట్లు ఎన్ఐఏ కోర్టు పేర్కొంది.అమెరికా నుంచి రాణాను తీసుకొచ్చిన తర్వాత 18 రోజుల కస్టడీని ఎన్ఐఏకి మంజూరు చేస్తూ ఢిల్లీ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో గత శుక్రవారం తెల్లవారుజామున అతన్ని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తీసుకొచ్చారు. అదనపు సెషన్స్ జడ్జి (ఎన్ఐఏ) చందర్ జిత్ సింగ్ అతనికి కస్టడీ విధించారు. ఈ కేసులో లోతుగా విచారణ చేపట్టాలని, కుట్రను బహిర్గతం చేసేందుకు రాణాను నిరంతర విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు.'ఈ కేసులో ఆరోపణలు దేశ భద్రతకు సంబంధించినవని చెప్పేందుకు తగినన్ని ఆధారాలున్నాయి. రికార్డులో సమర్పించిన విషయం ప్రకారం కుట్ర భారతదేశ భౌగోళిక సరిహద్దు దాటి ప్రయాణిస్తోందని. దేశ రాజధానితో సహా భారతదేశంలోని అనేక నగరాల్లోని వివిధ ప్రదేశాల్లో బహుళ ప్రాంతాల్లో పేలుళ్లకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే అసలు విషయం తెలుసుకునేందుకు, కుట్రలో ఉన్న వాస్తవాలను వెలికితీసేందుకు

2లో..



## నెలలో వెళ్ళిపోండి

**లేదంటే అరెస్ట్ చేస్తాం: ట్రంప్ వార్నింగ్**

2లో..

## కాల్పులు విరమించి, శాంతి నెలకొల్పాలి

**- మోదీ, అమిత్ షాలకు లేఖ ద్వారా రిక్వెస్ట్**




**న్యూఢిల్లీ** గత కొంతకాలం నుంచి వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో ఎందరో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అయితే ఇకనైనా కాల్పుల విరమణ, శాంతి చర్చలు చేపడితే మంచిదని శాంతి చర్చల కమిటీ భావిస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వము, కమ్యూనిస్టు పార్టీ అఫ్ ఇండియా

2లో..



టీటీడీ పరువు

## తీసేందుకు కుట్ర

**- భూమనపై హోంమంత్రి అనిత ఫైర్**

8లో..

## ఇవాళే ఎస్సీ వర్గీకరణ జీవో రిలీజ్



హైదరాబాద్, షార్ప్ న్యూస్ : సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈనెల 5 నుంచి 14 వరకు సామాజిక సాధికారత ఉత్సవాలు జరుపుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎస్సీ వర్గీకరణ జీవో విడుదల చేస్తున్నామని చెప్పారు. సోమవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్

2లో..

## మంగళగిరిని నెంబర్ 1 చేస్తా : మంత్రి లోకేశ్



మంగళగిరి (షార్ప్ న్యూస్): మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. "మన ఇల్లు %-% మన లోకేష్" కార్యక్రమంలో పాల్గొని ఎర్రబాలెంలో 100 పడకల హాస్పిటల్ కి శంకుస్థాపన చేశారు. 354 మంది అర్హులైన వారికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. మంగళగిరిలో అభివృద్ధి మాటలకే పరిమితం కాకుండా జనానికి కనిపించాలన్నదే

2లో..



## ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదానికి 50 రోజులు

**- రెస్క్యూ ఆపరేషన్ ఎంత వరకు వచ్చింది?**

8లో..

## రేవంత్‌ని నమ్మి తెలంగాణ ఆగమైంది: కేటీఆర్



**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి లాంటి మోసపూరిత నేతను నమ్మి మోసపోయారని, రాష్ట్రానికి చివరికి చేతిలో చిప్పే మిగిలిందని అన్నా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు. మల్కాజిగిరిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూటకపు వాగ్దానాలతో రేవంత్, కాంగ్రెస్ పార్టీ జనాన్ని మోసం చేశాయని ఆరోపించారు. ఒక్కసారి మోసపోతే అది మోసగాడి తప్పు, కానీ పదేపదే మోసపోతే అది మన తప్పవుతుంది. అందువల్ల ఈసారి ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్‌ను తిప్పికొట్టాలని ప్రజలకు కేటీఆర్ పిలుపు ఇచ్చారు. రాబోయే జీహెచ్ఎంసీతో పాటు అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్‌ను తిరస్కరించాలని కోరారు. రాష్ట్రం దారుణంగా వెనుకబడుతుంటే,

2లో..

## ఇవాళ్టి నుంచే భూభారతి పోర్టల్

**- రాష్ట్రంలో 3 పైలట్ మండలాల ఎంపిక - ' జూన్ 2 నాటికి రాష్ట్రమంతటా అమలు**

**- అసెంబ్లీ ఎన్నికలకు భూభారతి రిఫరెండం**

**- వచ్చే నెల మొదటివారంలో గ్రామపరిపాలనాధికారులు**



**హైదరాబాద్, షార్ప్ న్యూస్ :** రాష్ట్రంలోని రైతులకు భూముల భద్రత కల్పించాలనే లక్ష్యంతో భూభారతి చట్టం, భూభారతి పోర్టల్ ను ప్రారంభిస్తున్నట్ట రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చట్టాన్ని ఏప్రిల్ 14న ప్రజలకు అంకితం చేస్తారని చెప్పారు. ధరణి సిస్టమ్ ను బంగాళాఖాతంలో కలిపేస్తామన్న మా హామీకి కట్టుబడి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ భూభారతి చట్టాన్ని తీసుకొచ్చాం. ఇందులో భాగస్వామ్యం కావడం తన అదృష్టమని అన్నారు పొంగులేటి. ముందుగా మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా భూభారతి చట్టాన్ని అమలు చేసి, జూన్ 2 నాటికి రాష్ట్రమంతటా పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. గతంలో అసెంబ్లీలో ప్రకటించినట్టే, ఈ చట్టం 2029 శాసనసభ ఎన్నికలకు రిఫరెండం కానుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

### పోర్టల్ అభివృద్ధి - ఫోరెన్సిక్ ఆడిట్

గత ప్రభుత్వం తెచ్చిన ధరణి విధానంలో జరిగిన భూ అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపడతామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. రైతులు, మేధావులు,

2లో..

## అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ కి బుద్ధి చెప్పండి: బండి సంజయ్



**కరీంనగర్, షార్ప్ న్యూస్ :** కాంగ్రెస్ హయాంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కు తీరని అవమానం జరిగిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి, జై భీమ్, జై బీజేపీ నినాదాలు చేస్తూ కార్యకర్తలతో ఉత్సాహంగా ముందుకు నడిచారు. అంబేద్కర్ స్టేడియం నుంచి కోతిరాంపూర్, కమాన్ చౌరస్తా, గీతాభవన్, సర్క్యూట్ గెస్ట్ హౌస్

2లో..

SHARP న్యూస్
జాతీయ తెలుగు దినపత్రిక



# ఉగ్ర కుట్ర సరిహద్దులు దాటింది

నిరంతర కస్టడీ విచారణ అవసరం' అని న్యాయమూర్తి ఆ ఉత్తర్వులో పేర్కొన్నట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. ఈ కేసులో అరెస్టైన మొదటి నిందితుడు రాణా కాబట్టి కోర్టు ముందు పూర్తి వాస్తవాలను సమగ్రంగా సమర్పించేందుకు ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు నిర్వహించేందుకు ఎన్ఐఏకు న్యాయమైన అవకాశం ఇవ్వాలని కోర్టు పేర్కొంది. 'కుట్రలోని లోతైన అంశాలను వెలికితీసేందుకు సుదీర్ఘ విచారణకు వీలుగా అతడికి (రాణా) దీర్ఘకాలిక కస్టడీ అవసరమని భావించాం. ముంబై దాడుల్లో పన్నిన వ్యూహాలను ఇతర నగరాల్లో కూడా అమలు చేసేందుకు పూనుకున్నట్లు అనుమానిస్తున్నాం. ఇలాంటి కుట్రలు మరెక్కడైనా అమలవుతున్నాయా అని దర్యాప్తు అధికారులు పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉంది' అని ఈ సందర్భంగా న్యాయమూర్తికి ఎన్ఐఏ తెలియజేసింది. కోర్టు రాణాను అడిగినప్పుడు, తన తరఫున వాదించడానికి తనకు చట్టపరమైన ప్రతినిధి ఎవరూ లేరని రాణా కోర్టుకు తెలిపారు. ఎన్ఐఏ అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా అందించినట్లు పేర్కొన్నాడు. తన తరఫున వాదించేందుకు న్యాయవాదిని కేటాయించాలని అభ్యర్థించాడు. తన తరఫున వాదించేందుకు నియమితులైన ఏ న్యాయవాది కూడా తన ద్వారా కీర్తిని సంపాదించాలని ప్రయత్నించకూడదని రాణా అభ్యర్థన చేశాడు. అతడి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు 26/11 దాడి నిందితుల గురించి మీడియాతో మాట్లాడవద్దని ప్రత్యేక న్యాయమూర్తి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ (లక్స్)ను ఆదేశించారు. ప్రతి 24 గంటలకు ఒకసారి రాణాకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతి రోజు తన న్యాయవాదిని కలవడానికి అనుమతి ఇవ్వాలని కూడా కోర్టు ఎన్ఐఏని ఆదేశించింది. 'లీగల్ సర్వీసెస్ కౌన్సెల్ వివరాలు మీడియాకు ఇప్పటికే తెలియకపోతే వాటిని బహిర్గతం చేయకూడదు' అని న్యాయమూర్తి ఆదేశించారు.

# కాల్పులు విరమించి, శాంతి నెలకొల్పాలి

– మావోయిస్టు పార్టీ మధ్యన కాల్పుల విరమణ, శాంతి చర్చల కోసం జోక్యం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు లేఖలు రాసింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకోవాల్సిన ఆవశ్యకత పేర్కొంటూ పీస్ డైలాగ్ కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్ర కుమార్ ఆదివారం నాడు ప్రధాని మోదీ, అమిత్ షాకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 'మేము పీస్ డైలాగ్ కమిటీ బాధ్యులము. ఈ కమిటీ పౌర సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది. సిపిఐ – (మావోయిస్టు) పార్టీ, కేంద్ర ప్రభుత్వము మధ్యన కాల్పుల విరమణ – శాంతి చర్చల స్థాపన కోసం ఏర్పాటు అయింది పీస్ డైలాగ్ కమిటీ. ఇరు పక్షాల మధ్య శాంతియుత చర్చలను సులభతరం చేయడంకోసం, కాల్పుల విరమణను ప్రోత్సహించడం, హింసను అంతం చేయడానికి స్థిరమైన పరిష్కారాలను కనుక్కోవడం, ఇరు పక్షాలకు సూచనలు చేయటం కమిటీ ముఖ్య ఉద్దేశం. ఈ కమిటీలో సమాజంలోని వివిధ వర్గాల నుండి న్యాయ కోవిదులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు , మానవ హక్కుల నిపుణులు, జర్నలిస్టులు, ప్రజా నాయకులు భాగస్వాములుగా ఉన్నారు. మధ్య భారతదేశములో మావోయిస్టు పార్టీ సాయుధులకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయుధులకు మధ్య జరుగుతున్న హింసా విధానాలకు సామాన్య ప్రజలు, ఆదివాసీలు జీవించే హక్కును కోల్పోతున్నారు. నిత్యం ఆయా ప్రాంతాలలో నెత్తుటి మధ్యలోనే ప్రజలు జీవిస్తున్నారు అని పత్రికలలో వస్తున్న వార్తలు చూసి మేము కలవరపడుతున్నాం. ఇద్దరి హింసా విధానాల ఫలితముగా మహిళలు, పిల్లలు, యువత భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామాలు, గూడేలు వదిలి తరలివెళుతున్నారని వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వాలు, రాజ్యాంగములో చెప్పిన విధంగా సంక్షేమ రాజ్యము ఏర్పాటు చేయుటకు సరియైన, తగినటువంటి వాతావరణం రోజురోజుకూ సమాజంలో క్షీణిస్తోందని ఆందోళన చెందుతున్నాము. మావోయిస్టు పార్టీ గెరిల్లాలు, ప్రభుత్వ బలగాల మధ్య జరుగుతున్న ఘర్షణను నివారించడానికి కాల్పుల విరమణ – శాంతి చర్చలు ఒక్కటే మార్గం అని ప్రజాస్వామిక వాదులముగా భావిస్తున్నాము. ఇరు పక్షాల మధ్య జరుగుతున్న ఈ సాయుధ సంఘర్షణ దేశంలోని అనేక ప్రాంతాలలో అశాంతి, మరియు ప్రాణనష్టానికి కారణమవుతోంది. మహిళలు మానభంగాలకు గురవుతున్నారు. చిన్నపిల్లలు తల్లి తండ్రులను కోల్పోతున్నారు, గిరిజన సముదాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, పెద్దఎత్తున మానవ హక్కులకు విఘాతము కలుగుతున్నది, ఈ హింసా విధానాలు సమాజంలో సామరస్యాన్ని దెబ్బతీస్తూ, అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నది. ఈ పరిస్థితుల దృష్ట్యా, భారత రాజ్యాంగం కల్పిస్తున్న సంక్షేమ రాజ్య స్థాపన కోసం మీరు వెంటనే జోక్యం చేసుకోవాలని, దేశంలో రగులుతున్న హింసను, వాటి పరిణామాలను, పరిస్థితులను చక్కపెట్టాలని కోరుతున్నాం. ఇరు పక్షాలు కాల్పుల విరమణకు పూనుకునే విధంగా, ఇరు పక్షాలు శాంతి చర్చల వైపు ప్రయాణించే వాతావరణాన్ని కల్పించుటకోసం, ఈ దేశ భవిష్యత్తు కోసం మీ జోక్యం తక్షణావసరం ఉందని మీరు భావించాలి. దీనికి మీరు సానుకూలముగా స్పందిస్తారని ఆశిస్తున్నాం' అని పీస్ డైలాగ్ కమిటీ లేఖలో పేర్కొంది.

# ఇవాళే ఎస్సీ వర్గీకరణ జీవో రిలీజ్

చేతుల మీదుగా తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. సామాజిక మార్పునకు కారణమైన బాబు జగ్జీవన్ రామ్, జ్యోతిబా పూలే, అంబేద్కర్ జన్మించిన నెల. ఈ నెలలో వారు ఇచ్చిన సామాజిక స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్సీ వర్గీకరణ అమలవుతోందని మంత్రి పొన్నం తెలిపారు. తెలంగాణ కులసర్వేలో తేలిన 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు పెంపుపై గవర్నర్ ఆమోదం పొందడం శుభసూచకమన్నారు. సుప్రీంకోర్టు కూడా రాష్ట్రపతి, గవర్నర్ ఎలా వ్యవహరించాలని తీర్పు రావడం ఈ రెండు బిల్లులకు శుభసూచకంగా భావిస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు.

# మంగళగిరిని నెంబర్ 1 చేస్తా : మంత్రి లోకేశ్

తన ఆలోచన అని మంత్రి లోకేష్ అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇప్పటి వరకు 17 కమ్యూనిటీ భవనాలకు స్థలాలు కేటాయించామని, రెండింటిని ప్రారంభించామని చెప్పారు. గత ప్రభుత్వంలో గుంతలతో పాడైన రోడ్లను ఇప్పటి ప్రభుత్వం రిపేర్లు చేసింది. మంగళగిరి %-% తెనాలి ఫోర్‌లైన్ రోడ్డును పీపీపీ విధానంలో చేపట్టామని చెప్పారు. వరదలతో ఇళ్లలోకి నీరు చేరిన మహానాడు కాలనీలో 300 కోట్ల రూపాయలతో రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు లోకేశ్ తెలిపారు. కొన్ని ఇంటిపట్టాలను వెంటనే ఇచ్చినా, కొన్ని ఎండోమెంట్స్, రైల్వే, అటవీ, ఇరిగేషన్ శాఖల కారణంగా ఆలస్యం అవుతున్నాయని లోకేశ్ తెలిపారు. అయినా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో ఇప్పటికి 3 వేల కుటుంబాలకు పట్టాలు ఇవ్వగలిగామన్నారు. మీ గుండెపై చేయిపెట్టి ఆలోచించండి %-% మా కూటమి నాయకులు ఒక్క కాఫీ తాగకుండా పనిచేస్తున్నారు. మీ కోసం అహర్నిశలు కష్టపడుతున్నామని లోకేశ్ తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో 'స్వచ్ఛ మంగళగిరి' ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే వెయ్యి టన్నుల చెత్త తొలగించామనీ, ఇది కొనసాగాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు మంత్రి లోకేశ్.

## గ్రామానికి రక్షగా.. రేపటి నుంచి

# బేతాళ స్వామి జాతర ప్రారంభం

అల్లాదుర్గం, : ఏడుపాయల వనదుర్గామాత జాతర తర్వాత అంతటి ప్రాచుర్యాన్ని పొందిన జాతర బేతాళ స్వామి జాతర. అల్లాదుర్గంలో కొలువుదీరిన బేతాళ స్వామి దేవాలయం రాష్ట్రంలోనే రెండవ ఆలయంగా ప్రసిద్ధి చెందినది. ఈ ఆలయాన్ని 4 వందల సంవత్సరాల క్రితం నిర్మించినట్లు ప్రాచుర్యంలో ఉంది. వందల ఏండ్ల క్రితం తీవ్రమైన వ్యాధులు ప్రబలి ప్రజలు మృతిచెందడంతో ప్రజలకు వ్యాధులు నయమై



ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని భూత, ప్రేత, పిశాచ గణాలకు అధిపతిగా పిలువబడే బేతాళుడి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లుగా వాడుకలో ఉంది. గ్రామానికి బేతాళుడు రక్షగా ఉన్నాడని ప్రతియేటా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వారం రోజులపాటు జాతర వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు జిల్లా నలుమూల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు హాజరవుతారు. స్వామిని నమ్ముకున్న భక్తులకు వారు కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రగాఢ విశ్వాసం. అలా కోరికలు తీరిన వారు స్వామివారికి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లిస్తారు. జాతర ఉత్సవాలను వారం రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. 14వ తేదీన పోలేరమ్మ దేవతకు బోనాలు, 15వ తేదీన పోచమ్మ దేవతకు బోనాలు, 18వ తేదీన దుర్గమ్మ దేవతకు బోనాలు, 17వ తేదీన బేతాళ స్వామికి బోనాలు, 18న బేతాళ స్వామికి ఎడ్ల బండ్ల ఊరేగింపు, 19న భాగవతం, 20న భజనలు, 21న సాంస్కృతిక కార్యక్రమాలు, 22న పాచి బండ్ల ఊరేగింపు నిర్వహించడం జరుగుతుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌర్యం కలగకుండా ఉండేందుకు నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లను చేశారు.

# నెలలో వెళ్ళిపోండి... లేదంటే అరెస్ట్ చేస్తాం

వాషింగ్టన్ డీసీ: అమెరికాలో ఉంటున్న విదేశీయులు 30 రోజుల్లోగా దేశం విడిచి వెళ్ళిపోవాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ట్రంప్ ప్రతిరోజూ ఏదో ఒక సంచలనాత్మక నిర్ణయం తీసుకుంటూ ప్రపంచ దేశాలను వణికిస్తున్నారు. అలాగే అమెరికాలో నివసిస్తున్న విదేశీయులను, విద్యార్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. ఇప్పటికే అనేక దేశాలపై టారిఫ్‌లు విధించి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారు. ఇప్పుడు మరో కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. ఇది అమెరికాలో ఉన్న విదేశీయులకు పెద్ద షాక్‌గా మారింది. ట్రంప్ ఆధ్వర్యంలోని యూఎస్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ విదేశీయులపై సరికొత్త నిబంధనలను ప్రకటించింది. ఈ రూల్స్ ప్రకారం, అమెరికాలో 30 రోజులకు పైగా ఉండే విదేశీయులు తప్పనిసరిగా తమ వివరాలను అధికారికంగా నమోదు చేసుకోవాలి. అలా చేయకపోతే వారికి భారీగా జరిమానాలు విధిస్తారు. అవసరమైతే అరెస్టు కూడా చేస్తామని అధికారులు హెచ్చరించారు. కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు వార్నింగ్ ఇచ్చారు.

**విదేశీయులు ఏం చేయాలి ?** ఏప్రిల్ 11 తర్వాత అమెరికాలోకి ప్రవేశించిన ప్రతి విదేశీయుడు 30 రోజుల్లోపు వేలిముద్రలు సమర్పించి, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. అలా చేయకపోతే రోజుకి దాదాపు 998 డాలర్ల జరిమానా విధిస్తారు. అది కూడా తప్పించుకుంటే, తెల్లారి నుంచి జరిమానా 1000 నుంచి 1500 డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉంటుంది. అప్పటికీ దేశం విడిచి వెళ్లకపోతే, శిక్షలతోపాటు అమెరికా నుంచి బహిష్కరిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో, స్వయంగా అమెరికా వీడి వెళ్లడం ఉత్తమమైన మార్గమని హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ సూచించింది. ఎలాంటి నేర చరిత్ర లేకపోతే అమెరికాలో సంపాదించుకున్న డబ్బును తీసుకొని వెళ్లవచ్చని కూడా తెలిపింది. ప్రయాణానికి టికెట్ ఖర్చు భరించలేని వారికి ప్రత్యేక రాయితీలు ఇస్తామని సోషల్ మీడియాలో అమెరికా అధికారులు వెల్లడించారు. ఈ కొత్త నిబంధనలు %ఎ-1దీ% వీసా లేదా స్టూడెంట్ వీసా లాంటి అధికారిక అనుమతులు కలిగిన వాళ్ళపై ప్రభావితం చూపించబోవని నిపుణులు చెబుతున్నారు. కానీ, అక్రమంగా లేదా అనుమతుల్లేకుండా అమెరికాలో ఉండే వారిపై మాత్రం చట్టాలను కఠినంగా అమలు చేస్తామని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. %ఎ-1దీ% వీసా కలిగిన వారు ఉద్యోగాన్ని కోల్పోయిన తర్వాత నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా దేశం విడిచి వెళ్లకపోతే, వారిపైనా ఈ కొత్త చట్టాల ప్రభావం తప్పదని హెచ్చరిస్తున్నారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంతో అమెరికాలోని వలసదారుల జీవితాలపై తీవ్రంగా ప్రభావితం చూపిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# టీటీడీ పరువు తీసేందుకు కుట్ర

అమరావతి, షార్ప్ న్యూస్: అసత్య ప్రచారాంలో టీటీడీ పరువు తీయడానికి కుట్ర జరుగుతోందని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. తిరుమల గోశాలలో ఆవులు చనిపోయాయంటూ వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారని అనిత ఫైర్ అయ్యారు. గోశాలలో 260 మంది సిబ్బంది గోసంరక్షణ పనులు చేస్తున్నారని తెలిపారు. దాదాపు 2,668 ఆవులకు జియోట్యాగ్ చేసి పర్యవేక్షిస్తున్నారని వివరించారు. కరుణాకరరెడ్డి టీటీడీ ఖజానాను దారి మళ్లించి కమీషన్లు కొట్టేశారు. తిరుమల కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించింది ఆయనే. ఏడుకొండలను 5 కొండలుగా మార్చేందుకు భూమన కుట్ర చేశారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఉన్న ఎస్వీ గోశాలలో 3 నెలల కాలంలో 100కి పైగా గోవులు అనుమానాస్పద స్థితిలో చనిపోయాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. పవిత్రక్షేత్రమైన తిరుమలలో ఇలాంటి ఘటనలు జరగడం దారుణమనీ, టీటీడీ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని భూమన ఆరోపించారు. భూమన కామెంట్స్ ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కూడా ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేయొద్దన్నారు.

# అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ కి బుద్ధి చెప్పండి

మీదుగా కోర్టు చౌరస్తా వరకు ఆయన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి దేశాన్ని ప్రజాస్వామ్య మార్గంలో నడిపించిన మహనీయుడైన అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా కాంగ్రెస్ అవమానించిందన్నారు బండి సంజయ్. డూప్లికేట్ గాంధీ కుటుంబం అంబేద్కర్‌ను చరిత్ర నుంచి తొలగించేందుకు ప్రయత్నించిన చీకటి అధ్యాయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. అంబేద్కర్ మృతదేహానికి ఢిల్లీలో అంత్యక్రియలు జరగకుండా ముంబైకి తరలించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తరలింపునకు విమాన ఛార్జీలు కూడా చెల్లించలేదు. ఆ తర్వాత అంబేద్కర్ సతీమణికి బిల్లు పంపిన చరిత్ర కాంగ్రెస్ ది అని బండి సంజయ్ గుర్తుచేశారు. 1951లో హిందూ కోడ్ బిల్లును సమర్థించిన అంబేద్కర్ అభిప్రాయాలను నెహ్రూ తిరస్కరించడంతో, మనస్తాపానికి గురై ఆయన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. తర్వాత జరిగిన 1952, 1954 ఎన్నికల్లో అంబేద్కర్ ను ఓడించేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నిందని బండి సంజయ్ ఆరోపించారు. అంబేద్కర్‌ను ఓడించినవారికి పద్మభూషణ్ ఇచ్చిన కాంగ్రెస్, ఆయనకు భారతరత్నకు ఇవ్వలేదన్నారు.

**అంబేద్కర్ ఆశయాలు కాపాడింది బీజేపీయే** ఇప్పటివరకు అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌కు గౌరవం కల్పిస్తూ 'పంచతీర్థ' ప్రాజెక్టును ప్రారంభించింది. దళితులకు సామాజిక, ఆర్థిక స్థిరత్వం ఇవ్వాలనే లక్ష్యంతో 12 మంది దళితులను, 27 మంది ఓబీసీలను, 8 మంది మహిళలను కేబినెట్ లోకి తీసుకుందన్నారు బండి సంజయ్. దళితుడైన రామ్ నాథ్ కోవింద్‌ను, ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతులుగా నియమించడం, జాతీయ బీసీ కమిషన్‌కి రాజ్యాంగ హోదా కల్పించడం లాంటి చారిత్రక నిర్ణయాలను బీజేపీ తీసుకువచ్చిందని వివరించారు. ఈ దేశంలో అంబేద్కర్‌ను నిజంగా గౌరవించే పార్టీ ఉందంటే అది బీజేపీ మాత్రమేనని, మిగతా పార్టీలకు ఆయన ఆశయాలు అవసరం లేకుండా ఆయన పేరును వాడుకుంటున్నాయని ప్రజలు గుర్తించాలన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్.

# ఇవాళ్టి నుంచే భూభారతి పోర్టల్

నిపుణులతో చర్చించి ప్రజాభిప్రాయాలతో చట్టాన్ని రూపొందించామని తెలిపారు. భూభారతి పోర్టల్‌లో పాత ధరణిలో ఉన్న 33 మాడ్యూల్స్‌ను 6 మాడ్యూల్స్‌కు తగ్గించడం వల్ల ఇది మరింత ఈజీగా మారుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది లేకుండా పోర్టల్ ను అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో యూజర్లు పోర్టల్‌లో లాగిన్ కావొద్దని పొంగులేటి విజ్ఞప్తి చేశారు, లేదంటే పోర్టల్ పనిచేయడంలో సమస్యలు తలెత్తవచ్చన్నారు. పోర్టల్‌ను ఉద్దేశపూర్వకంగా స్టక్ చేయాలని ప్రయత్నిస్తే, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసు అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎన్ఐసి ఆధ్వర్యంలో అత్యాధునిక వెర్షన్ ద్వారా పోర్టల్‌ను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిప్నారు. **మేలో జీపీఓల నియామకం** గ్రామ పరిపాలనా అధికారుల నియామకాన్ని వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. గతంలో ధరణి అమలు చేసినప్పుడు నాలుగు నెలల పాటు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అందుకే ఈసారి అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం క్రమ క్రమంగా మార్పులు చేస్తోంది. భూభారతి అమలుకు ఎంపికైన గ్రామాల్లో తానే స్వయంగా పర్యటిస్తానని, మిగతా సంబంధిత మంత్రులు కూడా పర్యటిస్తారని పొంగులేటి తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో సమస్యలు తగ్గినట్లు భావిస్తే వాటిని క్రమేపీ తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. తహసిల్దార్ స్థాయి నుంచి సిసిఎల్ దాకా మొత్తం ఐదు స్థాయిల్లో అధికారాలను వికేంద్రీకరణ చేయడం వల్ల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

# రేవంత్‌ని నమ్మి తెలంగాణ ఆగమైంది: కేటీఆర్

ఒక్క రేవంత్ రెడ్డియే ఆనందంగా ఉన్నట్టు కనిపిస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నిక ఏదైనా, సందర్భం ఏదైనా ఈసారి ప్రజలు కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. తెలంగాణ ఆత్మ, స్వాభిమానం కాపాడాలంటే, నలుగురికీ భరోసా కలిగించే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అన్నారు కేటీఆర్.

పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నెల 27న పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం. ఒక పార్టీగా 25 యేళ్ళ ప్రయాణం ఎలాంటి మైలురాయో ప్రతి కార్యకర్తకు అర్థమవుతుందని కేటీఆర్ అన్నారు. కేటీఆర్ సభకు ముందు భారీ ర్యాలీ నిర్వహించి బీఆర్ఎస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. కాంగ్రెస్, బీజేపీకి చెందిన కొందరు నేతలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు.

# జానారెడ్డి ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారు

**- నాకు మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతున్నారు**

**- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన ఆరోపణలు**

**హైదరాబాద్** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత పార్టీ నేతలపై సంచలన కామెంట్స్ చేశారు. మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న ఆయన పార్టీ సీనియర్ నేతపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకే చెందిన సీనియర్ నేత జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు అడ్డుపడుతున్నారని విమర్శలు చేశారు. తనకు అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానంటే జానారెడ్డి అడ్డుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. తనకు అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానంటే పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు చెమటలు పడుతున్నాయన్నారు. కోమటిరెడ్డి చేసిన ఈ కామెంట్స్ కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపుతున్నాయి. పార్టీ సీనియర్ నేతపై రాజగోపాల్ రెడ్డి కామెంట్స్ చేయటం చర్చనీయాంశంగా మారింది. కాగా, తెలంగాణ మంత్రివర్గంలో ప్రస్తుతం ఆరు పదవులు ఖాళీగా ఉన్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఆశించినా, అది జరగలేదు. అయితే మంత్రి పదవి రేసులో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. మంత్రి పదవిపై కోమటిరెడ్డి ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు హోంమంత్రి పదవి అంటే చాలా ఇష్టమని, ఆ పదవి వస్తే సమర్థవంతంగా పనిచేస్తానని పలుమార్లు చెప్పారు. తనకున్న అనుభవం దృష్ట్యా ఆ శాఖను సమర్థంగా నిర్వహించగలనని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, తనకు మంత్రి పదవి వస్తుందని, పార్టీ తన సామర్థ్యాన్ని గుర్తించి తగిన పదవిని ఇస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే మంత్రి వర్గ విస్తరణపై సీనియర్ నేత జానారెడ్డి అధిష్ఠానానికి లేఖ రాశారు. పార్టీలో సీనియర్ నాయకులకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పార్టీ కోసం ఎంతో కాలంగా పనిచేస్తున్న అనుభవజ్ఞులకు అవకాశం ఇవ్వడం ద్వారా ప్రభుత్వం మరింత స్థిరంగా, సమర్థవంతంగా పనిచేయడానికి వీలుంటుందని ఆయన లేఖలో అభిప్రాయపడ్డారు. మంత్రివర్గ కూర్పులో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మంత్రి పదవుల ఎంపికలో అనుభవం, ఆయా నాయకుల సామర్థ్యాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జానారెడ్డిపై సంచలన కామెంట్స్ చేశారు.

# ఓల్డ్ సిటీలో మెట్రో పనులు వేగవంతం

**- రూ.212 కోట్ల నష్టపరిహారం పంపిణీ**

**హైదరాబాద్** ఓల్డ్ సిటీ ప్రజల చిరకాల స్వప్నం సాకారం కాబోతోంది. మెట్రో రైలు పరుగులు పెట్టేందుకు మార్గం సుగమం అవుతోంది. ఎంజీబీఎస్ నుండి చంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో మెట్రో రైలు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి విస్తరణ పనుల పురోగతిని సమీక్షించి, స్థల సేకరణ వేగంగా సాగుతోందని వెల్లడించారు. (మొత్తం ఈ మార్గంలో 1100 ప్రభావిత ఆస్తులు ఉండగా, ఇప్పటి వరకు 205 ఆస్తులకు చెక్కుల పంపిణీ జరిగిందని, ఆయా ఆస్తులకు సంబంధించిన రూ. 212 కోట్ల నష్టపరిహారం ఇప్పటికే చెల్లించడం జరిగిందని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ప్రభావిత ఆస్తుల యజమానులు స్వచ్ఛందంగా స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారాన్ని ఆమోదించి ముందుకు వచ్చి తమ ఆస్తులను మెట్రో మార్గం కోసం ఇచ్చారని ఆయన తెలిపారు. ప్రజల సహకారం లేకుండా ఈ ప్రాజెక్టు ముందుకు సాగడం కష్టమని ఆయన అన్నారు. ఈ మార్గంలో ఇరువైపులా చిక్కుముడులుగా ఉన్న కొన్ని క్లిష్టమైన విద్యుత్, టెలిఫోన్ కేబుళ్లను అత్యంత అప్రమత్తంగా తొలగించి తమ ఇంజినీరింగ్ సిబ్బంది మార్గాన్ని సుగమం చేసారని మెట్రో ఎండీ వెల్లడించారు. మెట్రో అధికారులతో పాటు, రెవిన్యూ, పోలీస్ పర్యవేక్షణలో మెట్రో మార్గం విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే రోడ్డు విస్తరణ కోసం పలు భవనాలు, కట్టడాలను కూల్చివేసి, అవశేషాలను తొలగించడం జరిగిందని చెప్పారు. ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి రోడ్డు విస్తరణ ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. సున్నితమైన కట్టడాలకు ఎటువంటి ముప్పు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. రంజాన్ సందర్భంగా విస్తరణ పనుల వేగం కొంత తగ్గినప్పటికీ, ఇప్పుడు అవి మళ్ళీ పుంజుకుని సజావుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. పాతనగరంలోని చారిత్రాత్మక కట్టడాలకు ఎటువంటి నష్టం జరగకుండా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మెట్రో పిల్లర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు త్వరితగతిన పాతనగరం విస్తరణ పనులు పూర్తి చేసి, కేంద్ర ప్రభుత్వ అనుమతి రాగానే మెట్రో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. మెట్రో రైలు అందుబాటులోకి వస్తే పాతనగర ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తయితే పాతనగరం రూపురేఖలు మారుతాయని, హైదరాబాద్ నగర అభివృద్ధికి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

# నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు

లబ్ధిదారులు తమ అవసరాలకు అనుగుణంగా 50 శాతం అదనపు స్థలాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. గృహ నిర్మాణంలో అవసరమైన సిమెంట్, స్టీల్ లాంటి నిర్మాణ సామగ్రి తక్కువ ధరలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపేలా రూపొందింది. అందువల్ల ఈ పథకం అమలులో పారదర్శకత, నిజాయితీ చాలా ముఖ్యం. అర్హులైనవారికే ఇండ్లు దక్కేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదానికి

# 50 రోజులు

**హైదరాబాద్** నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట దగ్గర శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్బీసీ) టన్నెల్‌లో ఫిబ్రవరి 22న ఘోర ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. టన్నెల్ పైకప్పు కూలిపోవడంతో 8 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఫిబ్రవరి 22 ఉదయం 8:30 గంటలకు టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)తో పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. టన్నెల్‌లోని 14 కిలోమీటర్ల వద్ద 'షియర్ జోన్' అనే భాగంలో పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో 50 మంది కార్మికులు లోపల ఉండగా.. 42 మంది సురక్షితంగా బయటపడ్డారు. మిగిలిన 8 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారిలో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టెక్నికల్ సిబ్బంది, నలుగురు కార్మికులు ఉన్నారు. భారత ఆర్మీ, నౌకాదళం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి కాలరీస్, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ఉత్తరాఖండ్ నుండి ర్యాట్ హోల్ మైనర్స్ నిపుణులు కూడా వచ్చారు. మార్చి 9న పంజాబ్‌కు చెందిన టీబీఎం ఆపరేటర్ గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహం లభ్యమైంది. మార్చి 25న ప్రాజెక్ట్ ఇంజినీర్ మనోజ్ కుమార్ మృతదేహాన్ని కూడా కనుగొన్నారు. మిగిలిన ఆరుగురి ఆచూకీ ఇంకా తెలియలేదు. ఈ ఘటన జరిగి 50 రోజులు దాటినా సహాయక చర్యల్లో పురోగతి లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంతో జరిగిన ఈ ఘటన అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు టన్నెల్ వద్ద ఎదురు చూస్తూ రోదిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మృతదేహాలను వెలికితీసి చేతులు దులుపుకున్నారని ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ పరిస్థితి ఏంటో ఓ సారి తెలుసుకుందాం.

ప్రమాదం జరిగినప్పటి నుండి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, ప్రత్యేక రోబోటిక్ బృందాలు సహా అనేక ఏజెన్సీలు ఈ ప్రయత్నాల్లో పాల్గొన్నాయి. మిగిలిన ఆరుగురు కార్మికుల అవశేషాల కోసం అన్వేషణ కొనసాగుతోంది. టన్నెల్ లోపలి భయంకరరమైన పరిస్థితులు ఉన్నాయి. టీబీఎం శిథిలాలు, బురద, నీటి ఊట, తక్కువ ఆక్సిజన్ స్థాయి వంటి అనేక సవాళ్ల కారణంగా సహాయక చర్యలు చాలా కష్టంగా ఉన్నాయి. టన్నెల్‌లో ఉన్న టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) కూడా సహాయక చర్యలను మరింత క్లిష్టతరం చేసింది. తాజా సమాచారం ప్రకారం శిథిలాల తొలగింపు టన్నెల్ చివరి 50 మీటర్ల వరకు చేరుకుంది. నీటి ఊట నుండి బురదగా మారిన పరిస్థితులు అడ్డంకిగా మారకపోతే మరో రెండ్రోజుల్లో ఇది పూర్తవుతుంది అధికారులు చెబుతున్నారు. ప్రమాదం జరిగి చాలా రోజులు అయినందున మిగిలిన కార్మికులు సజీవంగా దొరికే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. వారి మృతదేహాలను వెలికితీయడంపైనే ప్రస్తుతం దృష్టి సారించినట్లు చెప్పారు. మరో వారం రోజుల్లో వారి అవశేషాలు దొరికే ఛాన్స్ ఉందని అంటున్నారు.

## తిరుమలకు అన కొణిదల: శ్రీవారికి మొక్కులు



రేణిగుంట, షార్ప్ న్యూస్ : ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అనా కొణిదల తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని సోమవారం దర్శించుకోనున్నారు. ఆదివారం సాయంత్రం ఆమె రేణిగుంట ఎయిర్ పోర్టు ద్వారా తిరుపతికి చేరుకున్నారు. అనా కొణిదల సోమవారం తెల్లవారుజామున తిరుమలలో జరిగే సుప్రభాత సేవలో పాల్గొంటారు. తర్వాత ఆమె స్వామివారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారని జనసేన వర్గాలు తెలిపాయి. ఈమధ్య సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడ్డారు. దాంతో అన కొణదిదల స్వామివారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకుంటారు. శ్రీవారి దర్శనానికి టీటీడీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అంతకుముందు గాయత్రి సదనంలో టీటీడీ ఉద్యోగుల సమక్షంలో అన డిక్లరేషన్ పత్రాలపై సంతకం చేశారు

# కాంగ్రెస్ తో జనానికి విసుగెత్తింది: తలసాని





హైదరాబాద్, షార్ప్ న్యూస్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఆదివారం సనత్ నగర్ నియోజకవర్గంలోని వెస్ట్ మారేడ్‌పల్లి ఎమ్మెల్యే ఆఫీసులో బీఆర్ఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి పరంగా తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పాటైన బీఆర్ఎస్ 25 యేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న పార్టీ పండుగను ప్రతి డివిజన్‌లో ఘనంగా జరుపుకుందామని తలసాని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు అన్ని డివిజన్లలో తోరణాలు, జెండాలతో అలంకరించి పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. గత 15 నెలలుగా పేదలు, చిన్న వ్యాపారులు, ఫుట్‌పాత్ వాసులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాళ్ళకి నీడ లేకుండా పోయిందని తలసాని మండిపడ్డారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మీ, కుర్మ హేమలత, టీ. మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు నామన శేషకుమారి, అత్తిలి అరుణ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది: బీజేపీ నేతల ఆరోపణ



**నిజామాబాద్ జిల్లా, ఇందూర్ నగరం (షార్ప్ న్యూస్):** బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఇందూర్ నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ శుద్ధి కార్యక్రమం ఘనంగా జరిగింది. భారతీయ జనతా పార్టీ చేపట్టిన గావ్ చలో – బస్తీ చలో" కార్యక్రమంలో భాగంగా ఈ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ఎంపీ అర్వింద్ ధర్మపురి, అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ హాజరయ్యారు. డా. బి.ఆర్. అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం కోసం తన జీవితాన్నే పణంగా పెట్టి, బడుగు బలహీన వర్గాలకు వెలుగులు నింపిన మహానాయకుడని అన్నారు. అంబేద్కర్‌ను ఇప్పటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అంబేద్కర్‌ను మోసం చేసిందని ఎమ్మెల్యే ధన్ పాల్ ఆరోపించారు. అంబేద్కర్‌ను నిజంగా ఓడగొట్టింది కాంగ్రెస్ పార్టీనే అని, ఆయన చేసిన సేవలకు సరైన గుర్తింపు ఇవ్వకుండా అడుగడుగున అవమానించిందని మండిపడ్డారు. భారతరత్న లాంటి అవార్డులను తమ నేతలకు ప్రకటించుకున్న కాంగ్రెస్ నేతలు, దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన అంబేద్కర్‌కు మాత్రం భారతరత్న ఇవ్వలేదు. బీజేపీ ప్రభుత్వం ఈ గౌరవాన్ని అందించిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆఫ్ఘాన్లను బహిష్కరించిన పాకిస్తాన్

## – ఇళ్లకు 8.60 లక్షల మంది





ఇస్లామాబాద్ : పాకిస్థాన్ ప్రభుత్వం తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న అఫ్గానీలపై కఠిన చర్యలు ప్రారంభించింది. ఈ చర్యలతో ఇప్పటి వరకు దాదాపు 8.60 లక్షల మంది అఫ్గాన్ శరణార్థులు పాక్‌ను విడిచి వెళ్లినట్లు సమాచారం. ఈ ప్రక్రియ 2023 సెప్టెంబర్‌లో మొదలైంది. వీళ్ళల్లో దాదాపు ఐదు లక్షల మందికిపైగా వ్యక్తులు ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలోని రెండు సరిహద్దు క్రాసింగ్‌ల ద్వారా అఫ్గానిస్తాన్‌కి తిరిగి వెళ్ళినట్టు పాకిస్తాన్ మీడియా తెలిపింది. ఈ బహిష్కరణ ప్రక్రియను దశలవారీగా అమలు చేస్తున్నట్టు పాకిస్థాన్ స్పష్టంచేసింది. మొదటి దశలో సరైన డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా ఉండే వారిని మాత్రమే స్వదేశానికి పంపించామని పాక్ హోం మంత్రి తలాల్ చౌధరి తెలిపారు. అంతర్జాతీయ వలసల సంస్థ ఇచ్చిన సమాచారం ప్రకారం, 2023 సెప్టెంబర్ 15 నుంచి 2024 ఏప్రిల్ 5 వరకు మొత్తం 8,61,763 మంది అఫ్గాన్లు పాకిస్థాన్ విడిచి వెళ్లారు. ఈ ఏడాది జనవరిలో పాకిస్థాన్ ప్రభుత్వం మరో కీలక హెచ్చరిక జారీ చేసింది. అఫ్గాన్ సిటిజన్ కార్డు కలిగిన వాళ్ళంతా మార్చి 31 లోగా దేశం విడిచి వెళ్లాలని, లేకపోతే బహిష్కరణ తప్పదని తెలిపింది. ఈ హెచ్చరిక తర్వాత ఏప్రిల్ 1 నుంచి బహిష్కరణ ప్రక్రియ కొనసాగిస్తోంది. ఇప్పటివరకు అఫ్గాన్ సిటిజన్ కార్డు ఉన్న 16 వేలమందికిపైగా అఫ్గాన్లు పాక్‌ను విడిచిపెట్టారు. వాళ్ళల్లో 9 వేలమందికిపైగా స్వచ్ఛందంగా వెళ్లిపోయారు. మిగిలిన 6 వేల మందిపై బహిష్కరణ చర్యలు తీసుకున్నట్లు పాకిస్తాన్ అధికారులు వెల్లడించారు.పాకిస్థాన్ చర్యలపై అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. వలసల అంశంపై పాకిస్థాన్ విధానం, ప్రాంతీయ సంబంధాలు, మానవ హక్కుల అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ కొన్ని దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



సూర్యాపేట, షార్ప్ న్యూస్ : సూర్యాపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు వరుసగా రాజీనామా చేస్తూ గులాబీ గూటికి చేరుతున్నారు. హుజుర్ నగర్ నియోజకవర్గానికి చెందిన గరిడేపల్లి మండలం పొనుగోడుకి చెందిన మాజీ ఎంపీటీసీ మేళ్లచెరువు వెంకటరమణ ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నేతలకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి. కాంగ్రెస్ పాలనపై జనం విసిగిపోయారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలే తప్ప చేతల్లేవనీ, సాగునీటి కొరత, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం, మద్దతు ధరపై ప్రభుత్వ చర్యలతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు జగదీష్ రెడ్డి. స్థానికంగా నీళ్ల మంత్రే ఉన్నా, పొలాలు ఎండిపోతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని జగదీష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో హుజుర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు మాశెట్టి శ్రీహరి, పార్టీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, మాజీ సర్పంచ్ బొలిశెట్టి సుధీర్, నాయకులు అనంతు కర్ణాకర్ గౌడ్, అనంతు తరుణ్ గౌడ్, గుగులోతు కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వేద పాఠశాలకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



సత్తుపల్లి, షార్ప్ న్యూస్ బ్యూరో : ఈ తరం యువత కోసం వేద పాఠశాలలు ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బుగ్గపాడు గ్రామంలో శ్రీ విశ్వ ధర్మ క్షేత్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న వేద పాఠశాలకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో వేద పాఠశాల ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమంటూ నిర్వాహకులు రామడుగు ప్రసాదాచారిని ఆయన అభినందించారు. ఈ తరం యువతకు వేదాలు నేర్పడం, ఉపనిషత్తులపై అవగాహన కల్పించడం చాలా అవసరమని, పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వేదపాఠశాల ఏర్పాటులో ఉపయోగించారన్నారు. దేశం గర్వించదగ్గ విద్యార్థులను ఈ వేద పాఠశాలలో తయారుచేయాలని తుమ్మల ఆకాంక్షించారు. ముందుగా విశ్వ ధర్మక్షేత్రంలోని శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్పోరేట్ కాలేజీల టాలెంట్ టెస్టులపై నిరసన



సత్తుపల్లి, షార్ప్ న్యూస్:ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లిలో కార్పొరేట్ కాలేజీల్లో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ పై తీవ్ర నిరసన వ్యక్తమైంది. టాలెంట్ టెస్టులు పేరుతో విద్యార్థులను వారి తల్లిదండ్రులను చేస్తున్న మోసాలపై నిలదీశారు. అక్కడ ఆందోళన ఉద్రిక్త పరిస్థితికి దారి తీయడంతో స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఆ కార్పొరేట్ స్కూల్ కి వెళ్లి పరీక్షను నిలిపేశారు. విద్యార్థుల దగ్గర్నుంచి ఆన్సర్ షీట్లను స్వాధీనం చేసుకున్నారు. టీచర్లను చదువులు చెప్పనీయకుండా అడ్మిషన్ల కోసం హాలీడేస్, పగలూ, రాత్రి అని చూడకుండా రోడ్ల వెంట తిప్పుతున్నారని, వారికి అడ్మిషన్లు టార్గెట్లు పెడుతున్నారని ఎంఈఓ దృష్టికి తెచ్చారు. టాలెంట్, అడ్మిషన్ టెస్టులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు. టాలెంట్ టెస్ట్ నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్ళామనీ, డీఈవో ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో నిరసన కారులు ఆందోళన విరమించారు. స్థానిక కార్పొరేట్ స్కూల్స్ తమ గొప్పలు చాటుకునేందుకు, రాష్ట్రస్థాయి ర్యాంకులు తమవే అని ప్రకటించుకునేందుకు విజయవాడ ,గుడివాడ తదితర ప్రాంతాలలో పదవ తరగతి చదివిన మెరిట్ విద్యార్థులను ఇక్కడకు తీసుకొచ్చితమ పాఠశాల తరఫున ఫీజు కట్టి పరీక్షలు రాయించారని స్థానిక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎంఈఓ కు దృష్టికి తెచ్చారు. సత్తుపల్లిలో గత కొన్నేళ్ళుగా మరో కార్పొరేట్ గుర్తింపు లేదని బయటపడింది. గుర్తింపు లేని పాఠశాలలలో విద్యార్థులను చేర్చి మోసపోవద్దని ఈ సందర్భంగా ఎంఈఓ తల్లిదండ్రులకు సూచించారు.కార్పొరేట్ మోసాలపై విచారించి చర్య తీసుకోవాలని సత్తుపల్లి డివిజన్ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల సంఘం(%ు=ాహీూ%) ఎంఈఓ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేసింది.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు



జహీరాబాద్ : త్వరలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో పార్టీలో చేరికలతో సందడి వాతావారణం నెలకొంది. ఇవాళ జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.స్థానిక మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మండలానికి చెందిన డైరెక్టర్ బాలరాజ్, సర్పంచ్ సిద్ధప్ప, నాయకులు అనిల్, దేవయ్య, సాల్మన్, రఫీ, రాజు, శివకుమార్,సిద్ధు,గోపాల్, పవన్ కుమార్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి ఎమ్మెల్యే కొన్నింటి మాణిక్యరావు పార్టీ కండువా వేసి టిఆర్ఎస్ పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, పిఎసిఎస్ చైర్మన్ మచేందర్, పార్టీ సీనియర్ నాయకులు గుండప్ప ,విజయకుమార్, మండల పార్టీ నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కుమార్తెను నరబలి ఇచ్చిన తల్లికి మరణశిక్ష ..

# సూర్యాపేట కోర్టు సంచలన తీర్పు

**2021లో దారుణ ఘటన**

**సర్పదోషం పోగొట్టుకునేందుకు కన్నబిడ్డనే బలి**

**గతంలో భర్తపై తూకం రాయితో దాడి**

**అరుదైన కేసుగా భావించి మరణశిక్ష విధించిన న్యాయస్థానం**



సూర్యాపేట కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. 2021లో తన సొంత బిడ్డను నరబలి ఇచ్చిన బి. భారతి అనే మహిళకు మరణ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. భారతి తనకున్న 'సర్ప దోషం' తొలగిపోవాలనే దురుద్దేశంతో ఈ దారుణానికి ఒడిగట్టింది. భర్తపై తూకం రాయితో దాడి చేసిన కేసులో ఆమె గతంలోనే జైలు శిక్ష అనుభవించింది. ఈ నేరం కూడా ఆమెకు మరణ శిక్ష పడటానికి ఒక కారణంగా మారింది. మోతే మండలం మేకలపాటి తండాలో 2021 ఏప్రిల్ 15న ఈ దారుణం జరిగింది. భారతి ఇంట్లో ప్రత్యేక పూజలు చేస్తూ, ఏడు నెలల పసికందు గొంతు కోసి, నాలుకను కూడా కోసింది. ఆ సమయంలో ఆమె భర్త కృష్ణ, అనారోగ్యంతో మంచానపడిన మామ మాత్రమే ఇంట్లో ఉన్నారు. బిడ్డ ఏడుపు విని మామ లేచి చూడగా, రక్తపు మరకలతో భారతి బయటకు వస్తూ కనిపించింది. దేవుళ్ళకు బలి ఇచ్చి సర్పదోషం పోగొట్టుకున్నానని భారతి చెప్పింది.

వెంటనే ఈ విషయాన్ని ఆయన తన కుమారుడు కృష్ణకు చెప్పారు. దాంతో కృష్ణ బంధువులకు, ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పడంతో వారు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోతే పోలీసులు భారతిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పోలీసులు 10 మంది సాక్షులను విచారించారు. భారతికి సర్పదోషం ఉందని, దాని నివారణ కోసమే ఈ దారుణానికి ఒడిగట్టిందని కృష్ణ తెలిపాడు. అంతేకాకుండా, 2023లో కృష్ణ నిద్రిస్తుండగా భారతి తూకం రాయితో తలపై దాడి చేసింది. ఈ దాడిలో కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసులో భారతికి ఏడాది జైలు శిక్ష పడింది. పాఠశాలలో భారతి, కృష్ణ క్లాస్‌మేట్స్. ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో మొదట ఆమెకు వేరే వ్యక్తితో వివాహం జరిగింది. ఆ తర్వాత మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నారు. 2019లో కృష్ణ, భారతి వివాహం చేసుకున్నారు. పెళ్లికి ముందు భారతి మానసిక సమస్యలతో బాధపడేదని, ఖమ్మంలో మానసిక వైద్యులను కూడా సంప్రదించామని కృష్ణ తెలిపాడు. ప్రస్తుతం భారతి చంచల్‌గూడ మహిళా జైలులో ఉంది. అన్ని సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత కోర్టు ఈ కేసును 'అరుదైన కేసు'గా పరిగణించి భారతికి మరణ శిక్ష విధించింది.

# హిరోషిమా, నాగాసాకి అణుబాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?

1945 సంవత్సరం వస్తూ వస్తూనే జపాన్‌లో సామాన్యుల జీవితాలను నరకప్రాయం చేసింది. షాపుల్లో గుడ్లు, పాలు, టీ, కాఫీలు పూర్తిగా మాయమయ్యాయి. పాఠశాలల మైదానాల్లో, ఇంటి ఆవరణల్లో కూరగాయలు పెంచుకుని వాటినే తినేవారు. పెట్రోల్ సామాన్యులకు అందనంత ఖరీదైన వస్తువుగా మారిపోయింది. రోడ్లపై ఎక్కడా సొంత కార్లు పరుగులు తీస్తూ కనిపించేవి కావు. హిరోషిమా రహదారుల్లో ఎక్కడచూసినా సైకిళ్లలో, కాలినడకన వెళ్లే జనం, సైనికుల వాహనాలే కనిపించేవి. 1945 ఆగస్ట్ 6.. ఉదయం 7 గంటలకు దక్షిణం వైపు నుంచి వస్తున్న అమెరికా విమానాలను రాడార్లు పసిగట్టాయి. చెవులు చిల్లులు పడేలా హెచ్చరిక సైరన్ మోగింది. జపాన్ అంతటా రేడియో కార్యక్రమాలను నిలిపివేశారు. జపాన్‌లో అప్పటికే పెట్రోల్ నిల్వలు నిండుకున్నాయి. దాంతో ఆ విమానాలను అడ్డుకోడానికి జపాన్ తమ విమానాలను పంపించలేకపోయింది. 8 గంటలకు హెచ్చరిక సైరన్ ఆగింది. రేడియో కార్యక్రమాలు మళ్లీ మొదలయ్యాయి. 8 గంటల 9 నిమిషాలకు అమెరికా వైమానిక దళం కల్నల్ పాల్ టిబెట్స్ తన బీ–29 విమానం 'ఎనోలా గే' ఇంటర్ కమ్‌లో ఒక ప్రకటన చేశారు. 'మీ గాగుల్స్ తీసుకోండి, వాటిని మీ నుదుటిపై పెట్టుకోండి' అన్నాడు.

## కౌంట్ డౌన్ మొదలవగానే



'కౌంట్ డౌన్ మొదలవగానే, వాటిని మీ కళ్లకు పెట్టుకోండి. మీకు కింద భారీ వెలుగు కనిపించకుండా పోయేవరకూ వాటిని అలాగే ఉంచుకోండి'. విమానం పొట్టలో 3.5 మీటర్ల పొడవు, 4 టన్నుల బరువుతో బ్లూ–వైట్ రంగులతో ఉన్న 'లిటిల్ బాయ్' బాంబు ఉంది. దానిని టాప్ సీక్రెట్ మన్‌హాటన్ ప్రాజెక్ట్ కింద లాస్ అలామోస్, న్యూ మెక్సికోలో ఉన్న ప్రయోగశాలల్లో తయారు చేశారు. దాని తయారీని చాలా రహస్యంగా ఉంచారు. ఎంత రహస్యంగా అంటే, అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ మరణించాక, ఉపాధ్యక్షుడు హారీ ట్రూమెన్ కొత్త అధ్యక్షుడి బాధ్యతలు తీసుకునే వరకూ ఆయనకు కూడా దాని గురించి తెలీదు. 'ఎనోలా గే' కుడి రెక్క నుంచి పది మీటర్ల దూరంలో ఒక కిలోమీటర్ వెనుక 'గెట్ ఆర్టిస్ట్' అనే ఇంకో బీ–29 విమానం ఎగురుతోంది. అక్కడ మూడో బాంబర్ కూడా వెళ్తోంది. దానిని జార్జ్ మార్క్‌వర్డ్ నడుపుతున్నారు. ఆయనకు ఫొటోలు తీసే బాధ్యత మాత్రమే అప్పగించారు. సరిగ్గా 8 గంటల 13 నిమిషాలకు 'ఎనోలా గే, బాంబార్డియర్ మేజర్ టామ్స్ ఫ్రేబీకి హెడ్ ఫోన్లో 'ఇటీజ్ ఆల్ యువర్స్' అని కల్నల్ పాల్ టిబెట్స్ సందేశం వినిపించింది.. తర్వాత ఆయన ఇంటర్‌కామ్‌లో 'మీ గాగుల్స్ పెట్టుకోండి' అన్నాడు. ఫ్రేబీకి తన గాగుల్స్ నుంచి టార్గెట్ ఏఓఐ బ్రిడ్జ్ కనిపించగానే, 'ఐ హావ్ గాటిట్' అని అరిచాడు.

## హిరోషిమాపై పడిన లిటిల్ బాయ్



సరిగ్గా 8 గంటల 15 నిమిషాలకు 'ఎనోలా గే' నుంచి బయటకు వచ్చిన లిటిల్ బాయ్ హిరోషిమా మీద పడడం మొదలైంది.. 'ఎనోలా గే' నుంచి లిటిల్ బాయ్ కిందకు రావడానికి 43 సెకన్లు పట్టింది. గాలులు వేగంగా వీస్తుండడంతో అది తన లక్ష్యం ఏఓఐ బ్రిడ్జికి 250 మీటర్ల దూరంలో ఉన్న షీమా సర్జికల్ క్లినిక్ పైన పడింది. అది పేలినపుడు ఆ శక్తి 12,500 టన్నుల టీఎంటీతో సమానంగా ఉంది. ఆ ఉష్ణోగ్రత హఠాత్తుగా 10 లక్షల సెంటీగ్రేడ్‌కు చేరింది. 'ద గ్రేట్ ఆర్టిస్ట్'లో ఉన్న పైలెట్ మేజర్ చార్లెస్ స్వీనీ పైనుంచి చూసినపుడు విశాలంగా ఉన్న ఒక అగ్నిగోళం ఏర్పడడం కనిపించింది. ఒకే ఒక్క క్షణంలో నగరంలోని కాంక్రీట్ భవనాలు తప్ప భూమిపై వస్తువులన్నీ మాయమైపోయాయి. విస్ఫోటనం తీవ్రతతో గ్రౌండ్ జీరో నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్ని భవనాల కిటికీ అద్దాలూ ముక్కలైపోయాయి.

## ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్ బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

## ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది.?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్ బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

## బాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?



జపాన్ నౌకా దళం డ్రాఫ్ట్‌మెన్ సుతోమూ యామాగూచీ దృష్టి పైన ఎగిరే విమానంపై పడింది. విమానం నుంచి ఒక చిన్న నల్లటి వస్తువు కింద పడుతుండడం కనిపించింది. తర్వాత క్షణంలోనే అతడికి కళ్ల ముందు చూపు పోయేంత వెలుగు వచ్చింది. అతడి అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. దాంతో చేతులతో కళ్లు మూసుకున్న అతడు నేలపై బోర్లా పడిపోయాడు. కింద భూమి కంపించడంతో యామాగూచీ సుమారు అర మీటరు ఎత్తుకు ఎగిరిపడ్డాడు. తను తిరిగి కళ్లు తెరిచినప్పుడు చుట్టూ అంధకారం అలుముకుని ఉంది. హఠాత్తుగా అతడికి తన ఎడమ వైపున, ఎడమ చేతి దగ్గర భరించలేనంత వేడిగా అనిపించింది. వాంతి చేసుకోవాలనిపిస్తోంది. కళ్లు తిరుగుతున్నాయి. స్పృహ తప్పుతోంది. అప్పుడే అతడికి కొంత దూరంలో ఒక చెట్టు కనిపించింది. దాని ఆకులన్నీ పూర్తిగా రాలిపోయి ఉన్నాయి. ఆ చెట్టు వరకూ వెళ్లడానికి అతడు తన బలమంతా ఉపయోగించాడు. ఎలాగోలా అక్కడికి చేరుకుని దాని మొదలు దగ్గర కూచున్నాడు. అప్పటికే అతడి గొంతు పూర్తిగా ఎండిపోయింది. దాహంతో తపించి పోతున్నాడు.

## బతికి బయటపడినా




హిరోషిమా తూర్పు ప్రాంతంలో ఒక రైలు నగరం వైపు వస్తోంది. సైనికులు హఠాత్తుగా వెళ్తున్న ఆ రైలును ఆపేశారు. లోపల ఉన్న వాళ్లందర్నీ కిందకు దించేసి వెళ్లిపొమ్మన్నారు. డబ్బాలను ఇంజన్ నుంచి వేరు చేసి, అక్కడే ఆపేశారు. కానీ ఇంజన్ మాత్రం ముందుకెళ్లిపోయింది. కానీ అది ఎంతో దూరం వెళ్లలేకపోయింది. ఎందుకంటే కాలినడకన వెళ్లే వారితో ఆ రైల్వే లైన్ అంతా నిండిపోయి ఉంది.వారిలో కొంతమంది ముఖం నుంచి చర్మం ఊడిపోయింది. కొంతమంది చేతులు విరిగిపోయి శరీరానికి వేలాడుతున్నాయి. కొంతమంది చాలా నెమ్మదిగా నడుస్తున్నారు. వాళ్లందరి నోటి నుంచి ఒకే మాట వస్తోంది. 'నీళ్లు.. నీళ్లు కావాలి.'

## నేను చనిపోతానా.?



అణుబాంబు విస్ఫోటనంతో ఏర్పడిన మేఘాల వల్ల సుమారు 11 గంటలకు హిరోషిమాలో భారీ వర్షం కురవడం మొదలైంది. ఆ వర్షం నల్లగా పడుతోంది. దానిలో దుమ్ము, ధూళి, విస్ఫోటనంతో ఉత్పన్నమైన రేడియో ధార్మిక లక్షణాలు ఉన్నాయి. నిజానికి, ఆ వర్షం చిక్కగా ఉన్న నల్లటి రంగులా ఉంది. గ్రీజులా ఉన్న ఆ వర్షంతో గోడలపై, బట్టలపై మరకలు పడ్డాయి. అక్కడ ఆకులు లేని చెట్టు కింద కూచున్న యామాగూచీ మాత్రం రేడియో యాక్టివ్ వర్షంలో తడవకుండా ఉండగలిగాడు. కాస్త దూరంలోనే ఒక గుంత కనిపించిండంతో అక్కడికి పాక్కుంటూ వెళ్లాడు. అక్కడ ఒక మహిళ ఉంది. ఆమె బట్టలన్నీ కాలిపోయాయి. చర్మం కూడా కమిలి ఎర్రగా అయిపోయింది. ఆమె లేవాలని ప్రయత్నించింది. కానీ పడిపోయింది. లేవలేని స్థితిలో 'సాయం చేయండి, సాయం చేయండి' అంటోంది. యామాగూచీని చూడగానే గొంతు తెచ్చుకున్న ఆమె 'నేను చనిపోబోతున్నానా' అని అడిగింది. అప్పుడే అక్కడకు ఇద్దరు విద్యార్థులు వచ్చారు. వాళ్లకేం కాలేదు. వాళ్లు యామాగూచీతో 'మీరు బాగా కాలిపోయినట్టు కనిపిస్తున్నారు' అన్నారు. యామాగూచీ తన ముఖాన్ని మెల్లగా తడుముకున్నాడు. చర్మం ఊడి చేతికి వస్తున్నట్టు అనిపిస్తోంది. నల్లగా అయిపోయిన తన చేతులు అంతకంతకూ వాచిపోతున్నాయి. ఆ విద్యార్థులు యామాగూచీని తీసుకుని క్లినిక్ చేరారు. అక్కడ కాలిపోయిన శవాలు ఉన్నాయి. కొంతమంది చేతులు కాస్త కదులుతున్నాయి. కానీ ఎక్కువ మంది శరీరాలు ఎలాంటి చలనం లేకుండా ఉన్నాయి. అక్కడ ఒక కంపౌండర్ యామాగూచీ ముఖంపై తెల్లటి క్రీమ్ రాశాడు. చేతికి కట్టు కట్టాడు. అక్కడ రెండు బిస్కెట్లు, కొన్ని నీళ్లు ఇచ్చారు. బిస్కెట్ కొరకగానే అతడు వాంతి చేసుకున్నాడు.

## హిరోషిమా విధ్వంసం చూసిన మొదటి విలేఖరి



స్థానిక విలేకరి 37 ఏళ్ల సాతోషీ నాకామురా ఆరోజు హీరోషిమాకు కాస్త దూరంలో ఉన్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లడం వల్ల ప్రమాదం తప్పించుకున్నారు. హీరోషిమాపై అణుబాంబు పడినప్పుడు, ఆ ప్రభావంతో ఆయన నేలమీద పడ్డారు. తన ముఖానికి పగిలిన అద్దాలు గుచ్చుకున్నాయి. తర్వాత నాకాముురా తన సైకిల్ తీసుకుని హీరోషిమా వైపు బయల్దేరారు. నాకాముురా హీరోషిమా విధ్వంసాన్ని చూసిన తొలి విలేకరి అయ్యారు. ఆయన డోమీ వార్తా ఏజెన్సీకి ఒకాయామా ఆఫీసు నుంచి మొదటి వార్త డిక్టేట్ చేశారు. '8 గంటల 16 నిమిషాలకు శత్రువులు రెండు విమానాల్లో హీరోషిమాపై ఒక ప్రత్యేక బాంబు వేశారు. హీరోషిమా మొత్తం నాశనం అయిపోయింది. సుమారు లక్షా 70 వేల మంది చనిపోయారు' అని చెప్పారు. ఈ వార్త విన్న డోమీ బ్యూరో చీఫ్, నాకాముురాతో అది నిజం కాదేమో అన్నారు. ఒక్క బాంబు వల్ల హీరోషిమాలో అంత మంది చనిపోతారా? నీ రిపోర్టులో మృతుల సంఖ్య మార్చాలని చెప్పారు. ఎందుకంటే సైన్యం దాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేదు. దాంతో కోపం వచ్చిన నాకమూరా టెలిఫోన్లోనే 'సైనికులు మూరు?లు' అని గట్టిగా అరిచాడు.

## మూడు రోజుల తర్వాత నాగసాకి మీద పడిన 'ఫ్యాట్ మ్యాన్'



1945 ఆగస్టు 9 మధ్యాహ్నం. జపాన్‌లోని మరో నగరం నాగసాకిలో బీ–29 బాంబర్లు రెండో ఆటం బాంబు జారవిడిచాయి. అది కిందకు చేరడానికి 43 సెకన్లు పట్టింది. బాంబు విస్ఫోటనంతో కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ ధ్వంసమైపోయింది. ఉష్ణ కిరణాలు మనుషుల శరీరంలోని ప్రతి నీటిబొట్టునూ ఆవిరి చేశాయి. క్షణంలోనే చాలా మంది చనిపోయారు, జంతువులు మాడిపోయాయి. పేలుడు తీవ్రతకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల అద్దాలు కూడా ముక్కలైపోయాయి. విస్ఫోటనంతో ఎగసిన వెలుగు కొన్ని సెకన్లే ఉన్నా, దానివల్ల ఏర్పడిన వేడి చర్మంపై థర్డ్ డిగ్రీ బర్న్స్ వచ్చేలా కాల్చేసింది. బాంబు పడిన ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో షిరోయామా ప్రైమరీ స్కూల్లో కాంక్రీట్ స్తంభాలు తప్ప వేరే ఏం మిగల్లేదు. అక్కడే నిలబడ్డ చియోకో ఇగాషిరా భయంకరమైన పేలుడు శబ్దాన్ని విన్నాడు. అప్పుడు తన వీపు నుంచి కొంత భాగం ఎగిరిపోయినట్టు అతడికి అనిపించింది. ఇగాషిరా వెంటనే కూతురికి తన శరీరాన్ని అడ్డుపెట్టి కవర్ చేశాడు. ఆ సమయంలో ఆమె తలపై వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకున్నాయి. కనుబొమల్లో ఒక్క వెంట్రుక కూడా మిగల్లేదు. ఇగాషిరా సాయం కోసం అరవాలని ప్రయత్నించాడు. కానీ తన నోటి నుంచి మాట రాలేదు.

## క్షణంలో నాగాసాకి నేలమట్టం



బాంబు పడిన కేంద్రానికి కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ వేడికి ఆవిరైపోయింది. అన్నీ కాలి బూడిదైపోయాయి. మైక్రో సెకను లోపలే నాగాసాకీ జైలులోని మూడు భవనాలు నేలమట్టం అయ్యాయి. జైల్లో ఉన్న ఒక్కరు కూడా బతకలేదు. రూట్ నంబర్ 206లో కరెంటుతో నడిచే ట్రామ్ నామరూపాలు లేకుండా పోయింది. నాగసాకీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో డాక్టర్ తకాషీ నగాయీ తన తరగతిలో ప్రాక్టీస్ చేయించడం కోసం కొన్ని ఎక్స్ రే ఫిల్ములు వెతుకుతున్నారు. అప్పుడే అతడికి చూపు పోగొట్టేంత వెలుగు కనిపించింది. ఆ పేలుడు తీవ్రతతో కిటికీ అద్దాలు పగిలి గది లోపలికొచ్చి పడ్డాయి. ఆ కిటికీల నుంచి గాలి వేగంగా లోపలికొచ్చింది. డాక్టర్ తకాషీ గాల్లో ఎగిరి పడ్డారు. ఆయన ముఖంపై కుడివైపు కోసుకుపోయింది. ముఖమంతా వేడిగా ఉన్న రక్తం కారుతోంది. అంతగా గాయపడ్డా తనకు ఎలాంటి నొప్పి లేకపోవడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

## ఒకటిన్నర కిలోమీటర్ దూరం వరకూ



ఆస్పత్రి బయట ఏ వస్తువూ గుర్తించేలా లేదు. అక్కడే ఉన్న సునియో తోమీతా కింద పడిన తన స్నేహితుడు కామోతోను తన భుజాలపై ఎత్తుకోడానికి ప్రయత్నించాడు. కానీ అతడి చేతులకు స్నేహితుడి మాంసం మాత్రమే వచ్చింది. కామోతో మళ్లీ కింద పడిపోయాడు. చనిపోతున్న వారికి, చనిపోయిన వారికి నోటి నుంచి రక్తం వచ్చింది. తోమీతా వాళ్ల మధ్యకు వెళ్లి నీళ్లు అందించాడు. వారికి ఏం కాదని చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ కాసేపటికి అతడు, ప్రొఫెసర్ సికీ మాత్రమే ప్రాణాలతో మిగిలారు. ఆయన చుట్టూ సుమారు 20 శవాలు పడున్నాయి. ఎక్కడ చూసినా మంటలు చెలరేగుతున్నాయి. విస్ఫోటనం జరిగిన స్థలం నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న ఒక టార్పెడో ఫ్యాక్టరీలో మిత్సుయీ తకీనో కూడా స్పృహతప్పి నేలపై పడిపోయింది. ఆమెకు స్పృహ వచ్చినపుడు చుట్టూ జనాల అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ఆమె పైనంతా శిథిలాలు పడున్నాయి. ఆమె కష్టంగా తన కుడి చేతిని తప్పించగలిగింది, కానీ కింద నేలపై ఆమెకు తడిగా ఏదో తగిలింది. తడిమి చూసినపుడు, నేలపై తన రక్తమే ఉందని, తను రక్తపు మడుగులో ఉన్నానని ఆమెకు తెలిసింది.

**( క్రేక్ కోలీ పుస్తకం 'నాగాసాకీ', జేమ్స్ డెల్‌గా ర్డో పుస్తకం 'న్యూక్లియర్ డాన్', చికాసావు మోరాసామీ పుస్తకం 'ద వైట్ స్కై ఇన్ హిరోషిమా' ఆధారంగా )**

SHARP న్యూస్
జాతీయ తెలుగు దినపత్రిక
సోమవారం, ఏప్రిల్ 14, 2025

# శుక్రగ్రహంపై గ్రహాంతరవాసుల జీవం..?

సూర్యమండలంలో కేంద్రమైన భానుడికి దగ్గరగా ఉన్న రెండవ గ్రహం శుక్రుడు. చంద్రుడి తరువాత శుక్రగ్రహం కూడా రాత్రివేళ ఆకాశంలో ప్రకాశవంతంగా వెలుగులు పంచగలుగుతుంది. సూర్యుడి చుట్టు ఒకసారి తిరగడానికి శుక్రగ్రహానికి 224.7 రోజులు పడుతుంది. ఆకారం, ద్రవ్యరాశి, సూర్యుడి నుండి దూరం మరియు సంఘటనలలో శుక్రగ్రహం మరియు భూగ్రహం ఒకేలా ఉన్నందున శుక్రుడిని భూమి 'సోదర గ్రహం (సిస్టర్ ప్లానెట్)' అంటారు. భూగ్రహం కోట్ల జీవులకు నెలవుగా ఉంది. శుక్రగ్రహంపై కూడా జీవుల ఉనికి ఉందనే ఆధారాలను 14 సెప్టెంబర్ 2020 రోజున అంతర్జాతీయ ఖగోళ శాస్త్రవేత్తల జట్టు వ్యక్తం చేసింది. శుక్రగ్రహం వాతావరణంలో ఆసక్తికలించే అరుదైన రసాయన అణువు "ఫాస్ఫీన్" ఉందని గుర్తించారు. సాధారణంగా జీవులు మాత్రమే ఉత్పత్తి చేయగల ఫాస్ఫీన్ ఉండడంతో శుక్రుడిపై 'గ్రహాంతరవాసులు లేదా ఏలియన్స్ లేదా ఎక్స్ట్రా టెరెస్ట్రియల్ జీవులు' ఉండవచ్చనే దిశలో పరిశోధనలు సాగుతున్నాయి. ప్రత్యక్షంగా శుక్రుడిపై జీవి ఉనికి గుర్తించినప్పటికీ, దాని వాతావరణంలోని ఆమ్ల మేఘాల సమీపాన రసాయన ఫాస్ఫీన్ ఉండడం ఆశ్చర్యాన్ని మరియు ఆసక్తిని రేకెత్తిస్తున్నదని పరిశోధకులు అంటున్నారు. భూమిపైన ఫాస్ఫీన్‌ను బ్యాక్టీరియా లేదా అసాధారణ పరిస్థితుల మధ్య పరిశ్రమలు మాత్రమే ఉత్పత్తి చేయగలవు. జీవులు మాత్రమే ఉత్పత్తి చేయగల ఇలాంటి రసాయన అణువులను శుక్రగ్రహ వాతావరణం కలిగి ఉండటమే ప్రాణుల ' జీవ-సంతకం (బయో-సిగ్నేచర్)' వైపుకు మన దృష్టిని ఆకర్షిస్తున్నాయి. శుక్రగ్రహ జీవుల ఉనికి పట్ల లోతైన అన్వేషణ చేస్తున్న అమెరికాలోని యంఐటి మాలిక్యులార్ ఆస్ట్రోఫిజిస్ట్ 'క్లార సౌసా-సిల్వా' అభిప్రాయం ప్రకారం ఫాస్ఫీన్ ఉనికి మరే ఇతర పద్దతిలో తయారుకాదని, ప్రాణులకు మాత్రమే దీనిని ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంటుందనే వాదన వినిపిస్తున్నారు. శుక్రగ్రహ ఉపరిత వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని, కాని గ్రహ ఉపరితలానికి 50 కిమీ ఎత్తున ఉన్న పొరలలో సాధారణ ఉష్ణోగ్రతాపీడనాలతో పాటు సల్ఫ్యూరిక్ ఆమ్లం, కార్బన్‌డైఆక్సైడ్ మరియు స్వల్ప నీటి ఆవిరి ఉండడంతో సహ సూర్యరశ్మి తీవ్రత తక్కువగా నమోదవుతుందని తెలుపుతున్నారు.

ఈ వాతావరణ పరిస్థితులలో ప్రాణులు ఉండే సంభావ్యతలను కొట్టిపారేయలేమని నిర్ధారణకు వస్తున్నారు. ఇలాంటి పరిశోధనా ఫలితాలు అమెరికా 'నాసా' శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించి మరింత లోతైన పరిశోధనలను చేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాబోయే రోజుల్లో శుక్రగ్రహం పైకి వెళ్ళగలిగే రోవర్ మిషన్లు కార్యరూపం దాల్చి, అక్కడి సాంపుల్స్ తేగలిగితే ఈ విషయంలో మరింత స్పష్టత రానుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఫాస్ఫీన్ వాయువు విషపూరితమైనదని, రసాయన ఆయుధాల తయారీలో వాడుతారని మనకు తెలుసు. అసాధారణ పరిస్థితులలో మాత్రమే పరిశ్రమలలో తయారు చేయగల దుర్వాసనగల ఫాస్ఫీన్ అణువులో ఫాస్పరస్ పరమాణువుతో మూడు హైడ్రోజన్ పరమాణువుల కలిసి బంధాలు ఏర్పరచుకొని పిరమిడ్ ఆకృతితో ఫాస్ఫీన్ (%ూ౦%3) ఏర్పడుతుంది. శుక్రుడిపై గ్రహాంతరవాసులు ఉన్నారనే రుజువులు ఖచ్చితంగా లేకపోయినా ఫాస్ఫీన్ వాయు ఉనికి ద్వారా జీవం ఉందనే వాదన బలపడుతోంది. ఈ ఆసక్తికర అంశాన్ని లోతైన పరిశోధనలతో సత్వరమే శుక్రగ్రహంపై జీవ-సంతకం నిర్ధారించబడాలని అందరం ఆశిద్దాం.

# ధర్మ సూత్రధారీ హే మురారీ



'కృష్ణస్తు భగవాన్ స్వయమ్'... కృష్ణుడే పరమతత్త్వం... చరమ లక్ష్యం... ఆయన గురించి చదవడం, చెప్పడం, పాడడం, వినడం... అన్నీ అపురూపమైన అనుభవాలే. 'నీలో లేని చోద్యాలు ఈ ప్రపంచంలో ఏం ఉంటాయి?' అని అక్రూరుడన్నా... 'అటువైపు కృష్ణుడున్నాడు... ఇటువైపు ఎవరున్నారు' అని సంజయుడు హెచ్చరించినా... అవన్నీ పరమాత్మ విరాట్‌రూపాన్ని విశదీకరించే ఉదాహరణలే... క్రియ, బోధ కలగలిసిన అద్భుత తత్త్వం ఆయనది... యుగావసరాలకు అన్వయించుకోదగ్గ మహాగాథ శ్రీకృష్ణుడిది. భక్తుల కోర్కెలు తీర్చే క్రమంలో భగవంతుడు రెండు రకాల విధానాలను అనుసరిస్తాడు. సర్వం తానే స్వయంగా నిర్వహించి, తనపై మనకున్న నమ్మకాన్ని పెంచుకోవడం మొదటి పద్ధతి. మన ప్రయత్నంలో రహస్యంగా సహకరించి, మనపై మనకు నమ్మకాన్ని పెంచి విజేతలుగా తీర్చిదిద్దడం రెండో పద్ధతి. ఇందులో మొదటి దాన్ని దైవికం అని, రెండోదాన్ని పౌరుషం అని శాస్త్రం నిర్వచించింది. పరమాత్మ ప్రతి అవతారంలో ఏదో ఒకమార్గాన్నే ఎంచుకున్నాడు. కానీ కృష్ణావతారంలో మాత్రం రెండు విధాలుగానూ మనకు ఆయన దర్శనమిస్తాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణల్లో భాగవతంలోని కృష్ణుడు ఎవరి సహాయాన్నీ కోరలేదు. స్వయంగా తానే అవతార లక్ష్యం దిశగా సాగిపోయాడు. భారతంలోని కృష్ణుడు మాత్రం రెండో పద్ధతి అనుసరించాడు. చేసిందంతా తానే అయినా ఘనతను మాత్రం పూర్తిగా పాండవుల పరం చేశాడు. వారిని విజేతలుగా నిలబెట్టాడు. భాగవత కృష్ణుడు విశేష రసజ్ఞ మనోజ్ఞ మూర్తి. భారత కృష్ణుడు అసాధారణ అలౌకిక ప్రజ్ఞానిధి. కృష్ణ కథలో ఈ రెండూ విభిన్న కోణాలు. ఈ రెండు రకాల పాత్రల స్వభావాలు విభిన్నమైనవి, అదే సయమంలో సర్వసమగ్రమైనవి.

**అదే కృష్ణమాయ!** భాగవత కృష్ణుడి బాల్యచేష్టలు ముగ్ధమోహనాలు. అదే సమయంలో లోకకల్యాణాలు. పసిబాలుడు భయంకర రాక్షస మూకలను మట్టుబెట్టినప్పుడు జనం నివ్వెరపోవడం సహజం. అవతార పురుషుడిగా అనుమానించడం సాధారణం. అలాంటి వారిని చిలిపి చేష్టల ముసుగులో ముంచేసేవాడు. ఇది లోకం దృష్టికి సమ్మోహనకరంగా, అదే సమయంలో లోచూపునకు సంక్లిష్టభరితంగా కనిపించేది. గోపబాలురకు చెలికాడిగా, గోపికలకు వెన్నెల వేలుపుగా ఆటపాటలతో అలరించిన అపూర్వ ఘట్టాలను అనుశీలించేటప్పుడు మనం కూడా వారిలా మారిపోవడాన్నే కృష్ణమాయ అంటారు. రమణీయ రసానుభూతులు పంచడంతో పాటు రాక్షస సంహారం కూడా ఆయన చేశాడు. ఒక పురాణ పురుషుడి సర్వసమగ్ర వ్యక్తిత్వానికి ఇది గొప్ప ఉదాహరణ.

**సుస్థిర పాలన కోసం...** భారత కృష్ణుడు ధీరోదాత్తుడు, రాజనీతిజ్ఞుడు, వ్యూహనిర్మాణ చతురుడు, స్ఫూర్తిప్రదాత, మహానేత. ఆయన అవతరించే సమయానికి లోకంలో పరిస్థితులు విషమంగా ఉన్నాయి. కంస, జరాసంధ, కాలయవన, నరక, శిశుపాల, దుర్యోధనాది స్వార్థ పరుల చేతుల్లో అధికారం, సంపద ఖైదీలయ్యాయి. ఇవన్నీ దుష్టుల చేతుల్లో ఉన్నప్పుడు సామాజిక పరిస్థితులు కూడా దయనీయంగా ఉంటాయి. ధర్మంలేని చోట భద్రత, నీతిలేని చోట మనశ్శాంతి ఉండవు. అలాంటి రాజుల చేతుల్లోనుంచి ప్రజలను రక్షించాలి. సువ్యవస్థను స్థాపించాలి. రాజ్యం చిన్నచిన్న ముక్కలుగా చీలిపోయి ఉంది. అరాచకం, అనైక్యత పెరిగిపోయాయి. ఆ దుస్థితిని, క్లిష్టతను పారదోలేందుకు కేంద్ర రాజ్య వ్యవస్థను ఊహించిన, నిర్దేశించిన అద్భుత రాజనీతిజ్ఞుడు శ్రీ కృష్ణుడు. ధర్మం తప్పిన రాజులందరినీ స్వయంగానో, పాండవుల చేతనో తుదముట్టించాడు. తాను రాజ్యాధికారం కోరుకోకుండా ధార్మిక చింతనాశీలురను పాలకులుగా ఎంచి, రూపొందించి సుపరిపాలనా కేంద్ర వ్యవస్థను నిర్మించాడు. ధర్మజుని నాయకునిగా తీర్చిదిద్దిన నాయక నిర్ణేత శ్రీకృష్ణుడు.

**యుద్ధం కూడా యజ్ఞమే!** భగవద్గీత ఆవిర్భావం కూడా ఈ యుగావసరమే. అడవిలో ముక్కు మూసుకుని కూర్చున్న సర్వసంగపరిత్యాగి తన శిష్యులకు ఏకాంతంగా నూరిపోసిన ధర్మోపదేశం కాదిది.. పద్దెనిమిది అక్షౌహిణల మహాసైన్యం యుద్ధరంగంలో మోహరించి, కయ్యానికి కాలుదువ్వుతున్న ఉత్కంఠ స్థితి. తాత్కాలిక నిర్వేదానికి గురైై ధర్మసంకటంలో పడిన మహాయోధుణ్ణి కార్యోన్ముఖుణ్ణి చేసేందుకు ప్రవచించిన ఉపదేశం. ఈ లోకానికంతటికీ వర్తించే ధీరవచనం. గీతాచార్యుడిగా శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం శిఖరసమానమైంది. ఆయుధాన్ని పట్టనని ప్రకటించిన శ్రీకృష్ణుడు, భీమార్జునులను ఆయుధాలుగా మలుచుకుని కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని సాగించాడు. యుద్ధాన్ని క్రతువు అన్నాడు పరమాత్మ. క్రతువు అంటే యజ్ఞం. 'న మమ' అనుకోవడం యజ్ఞంలో ప్రధానాంశం. 'నాది కాదు' అని ఆ మాటకు అర్థం. ఏం చేసినా, ఏం పొందినా 'న మమ' అనే భావనతో ఉండడం యోగి లక్షణం. అహంకార, మమకారాలను ఆహుతి చేసే మహోన్నత పరిణిత త్యాగశీలతనే కృష్ణుడు కర్మయోగం పేరిట అర్జునుడికి బోధించాడు. అది ఎప్పటికీ, సర్వమానవాళికీ అనుసరణీయం. కృష్ణా! ఓ మాట అడుగుతాను. నిజం చెబుతావా...? మనం ఆపదలో ఉన్నప్పుడు అడగకపోయినా వచ్చి మనకు సాయం చేసేవాడే స్నేహితుడని నువ్వే చెప్పావు కదా. మరి పాండవులు అన్ని కష్టాల్లో కూరుకుపోయినప్పుడు నువ్వేం చేస్తున్నావు? నువ్వు చెబితే ధర్మరాజు జూదం ఆడేవాడు కాదు కదా? లేదా నువ్వే ధర్మరాజు పక్షాన ఆడి అతడిని గెలిపించవచ్చుకదా. మరి నువ్వెందుకు అలా చూస్తుండిపోయావు? అంటూ నేరుగా కృష్ణుడినే అడిగాడు ఉద్ధవుడు. మరొకరైతే కృష్ణుడిని ఈ ప్రశ్న అడగటానికి కూడా ధైర్యం చేసేవారు కాదు. కానీ, ఇక్కడ అడిగినవాడు ఉద్ధవుడు. కృష్ణుడికి పరమ ప్రాణమిత్రుడు. రూపంలో కూడా అచ్చం కృష్ణుడిలాగా ఉండేవాడు. ఎంతటి ప్రాణమిత్రుడంటే నిద్రలో కూడా కృష్ణుడి పేరునే కలవరించేవాడు. అంతటి మిత్రుడు అడిగేసరికి శ్రీకృష్ణుడు కూడా మొహమాటం లేకుండా సమాధానం చెప్పాడు. ఉద్ధవా! విజయం ఎప్పుడూ వివేకవంతుడినే వరిస్తుంది. దుర్యోధనుడు వివేకవంతుడు. అందుకు ఆటలో నైపుణ్యం ఉన్న శకునితో తన ఆట ఆడించాడు. ధర్మరాజు మాత్రం తానే ఆట ఆడాలని అనుకున్నాడు. పైగా నేను అటువైపు రాకూడదని కోరుకున్నాడు. అందుకే అతడు పిలిచేవరకు రాకూడదని నిశ్చయించుకున్నా. పిలిస్తే మాత్రం తప్పకుండా వెళ్లేవాడిని అన్నాడు. అంటే కృష్ణా! తీవ్రమైన ఆపదల్లో కూరుకుపోయి పిలిస్తే గానీ రావా అంటూ మరోప్రశ్న వేశాడు ఉద్ధవుడు. మిత్రమా! జీవితంలో ప్రతిదీ కర్మానుసారమే జరుగుతుంది. నేను పక్కన ఉండి చూస్తుంటాను కానీ కర్మను మార్చలేను అన్నాడు కృష్ణుడు. అదేంటి కృష్ణా! నీ భక్తుల పక్కనే ఉంటూ వారు ఆపదలో ఉంటే చూస్తూ ఊరుకుంటావా? అన్యాయం కదూ అన్నాడు ఉద్ధవుడు. కృష్ణుడు నవ్వుతూ... మిత్రమా! నేను పక్కన ఉన్నాననే భావన ఉంటే అసలు తప్పే చెయ్యరు కదా భక్తులు అన్నాడు. తత్త్వం బోధపడింది ఉద్ధవుడికి. ఇంకా ఎన్నో సందేహాలు అడిగాడు. అన్నిటికీ తృప్తిగా సమాధానాలు చెప్పాడు పరమాత్మ. అవతార పరిసమాప్తి కాలంలో ఉద్ధవుడి పేరు మీద లోకం తన మీద వేసే నిందలు, వేసే ప్రశ్నలన్నింటికీ పరమాత్మ సమాధానం చెప్పాడు. ఈ సమాధానాల సమాహారమే 'ఉద్ధవగీత'గా ప్రసిద్ధిపొందింది.

**ఆ అయిదు భావాలు...** శ్రీకృష్ణుడు లీలామానుష రూపుడు. మానవుడిగా, దైవంగా మార్చిమార్చి తన వైభవాన్ని ప్రదర్శించాడు. శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య, మధుర భావాలను భక్తులు భగవంతుడిని చేరుకునే సులభ మార్గాలుగా భావించాలి. వాటిని స్వయంగా శ్రీకృష్ణుడి జీవితంలో కూడా మనం చూడొచ్చు.

**శాంతం:** ఎంత ఉద్రిక్త పరిస్థితుల్లోనైనా నందనందనుడు శాంతంగా వ్యవహరించాడు. శిశుపాలుడు నిండు సభలో అవమానపరిచి అనరాని మాటలు అంటున్నా ప్రతిఘటించలేదు. ఉద్రేకపడలేదు. భీష్మాదులు శిశుపాలుడిని హెచ్చరిస్తున్నా తాను మాత్రం పౌరుషానికి పోలేదు. ఇచ్చిన మాట ప్రకారం నూరు తప్పులను శాంతంగానే కాచాడు.

**దాస్యం:** పెద్దల వద్ద వినయ విధేయతలతో ఉండడమే దాస్యభావం. దేవాదిదేవుడైనా అగ్రజుల వద్ద అణకువగానే మెలిగాడు. గురువు సాందీపుని వద్ద బంటులా పనిచేశాడు. రేపల్లెలో గోవుల కాపరిగా ఆ మూగజీవాలనూ సేవించాడు. అందుకే దాస్యంలో ఆయనను మించిన దివ్యాంశుడు లేరంటారు.

వాత్సల్యం: చిన్న వాళ్లతో ప్రేమగా, ఆదరంగా ఉండడం వాత్సల్యం. ధీరగంభీరుడైన దేవకీపుత్రుడు వాత్యల్యానికి కూడా మారుపేరు. తనను ఆశ్రయించిన వారిని ఆదుకోవడంలో ఆయనను మించిన కరుణామూర్తి మరొకరు కానరారు. ద్రౌపది 'అన్నా! నీవే దిక్కు' అన్నందుకు నిండు సభలో ఆమె గౌరవాన్ని కాపాడాడు. సుయోధనుడు రాజభోగాలను సిద్ధంచేసినా, విదురుని ప్రేమపూర్వక ఆహ్వానాన్నే మన్నించాడు.

**సఖ్యం:** సన్నిహితులతో, స్నేహితులతో ప్రేమగా ఉండడం సఖ్యం. సఖ్యభావంతో సన్నిహితుల హృదయాల్లో నిలిచిపోయాడు ఈ హృ షీకేశుడు. చిన్ననాటి స్నేహితుడు కుచేలుడు నిరుపేదైనా, సతీ స మేతంగా అతని పాదాలు కడిగి ఆ జలాన్ని తన తలపై చలు ్లకు న్నాడు. ఆయన తెచ్చిన అటుకులనే మధురపదార్థాలుగా స్వీక రిం చాడు. ఇకఅర్జునుడికిఇష్టసఖుడిగాతుదివరకువెన్నంటి కాపాడాడు.

**మధురభావం:** తనను ఆరాధించే వాళ్లతో అంతే ఆరాధనతో ఏకమైపోవడం మధురభావం. గోపికలను మధురభావంతో ముంచెత్తి వాళ్లను అనేక లీలల్లో ఓలలాడించాడు. వారికి అలౌకికమైన ఆనందాన్ని అందిస్తూనే అంతిమంగా వారికి మోక్షాన్ని ప్రసాదించాడు. మధురభావం పరమాత్మ ఏ ఇతర

# చాలా 'పెద్దమ్మ'





మొక్కితే కరుణిస్తుంది. కోరితే వరమిస్తుంది. ప్రదక్షిణ చేస్తే నీడ్కె నిలుస్తుంది. జూబ్లీహిల్స్ పెద్దమ్మ... మనసున్న తల్లి! ఆలయ ఆవరణలో కాలుపెట్టగానే అమ్మ ఒడికి చేరినంత నిశ్చింత! మహిషాసురుడనే రాక్షసుడు ముల్లోకాల్నీ పీడించేవాడు. యజ్ఞయాగాదుల్ని నాశనం చేసేవాడు. రుషి పత్నుల్ని చెరబట్టేవాడు. ఇంద్రాదులను తరిమి కొట్టేవాడు. త్రిమూర్తులు కూడా ఆ ధాటికి తట్టుకోలేకపోయారు. 'పాహిమాం' అంటూ శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని ఆశ్రయించారు. మహిషుడేం సామాన్యుడు కాడు. మహా బలవంతుడు. అందులోనూ, వరగర్వంతో విర్రవీగుతున్నాడు. మహాశక్తి ముందు రాక్షసశక్తి చిన్నబోయింది. అంతిమ విజయం అమ్మవారిదే! ఆ సుదీర్ఘ పోరాటంలో అలసి సొలసిన మహాశక్తికి కాస్తంత విశ్రాంతి అవసరమనిపించింది. దుర్గమమైన అడవుల్లో...బండరాళ్ల మధ్య కొద్దిరోజులు సేదతీరింది. అదే...జూబ్లీహిల్స్‌లో ప్రస్తుతం పెద్దమ్మ దేవస్థానమున్న ప్రాంతమని స్థానిక ఐతిహ్యం. 'పెద్దమ్మ' అన్న మాట ఏ పురాణాల్లోనూ కనిపించదు. ఏ స్తోత్రాల్లోనూ వినిపించదు. ముగ్గురమ్మల మూలపుటమ్మే.. కడు పెద్దమ్మ! ఏడు ఎకరాల ఆవరణలో విస్తరించిన ఆధ్యాత్మిక క్షేత్రం...జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి గుడి! హైదరాబాద్ నాలుగు వందల సంవత్సరాల ప్రాచీన నగరం. భాగ్యనగర నిర్మాణానికి చాలా చాలా ముందే ...ఆమాటకొస్తే, వేల సంవత్సరాల క్రితమే జూబ్లీహిల్స్ ఆదిమతెగలకు ఆవాసంగా ఉండేదంటారు. వేటే జీవనంగా బతికే ఆ అమాయకులు తమ కులదేవత పెద్దమ్మ తల్లిని భక్తితో కొలిచేవారు. మంచి జరిగితే, నైవేద్యాలిచ్చి అమ్మ సమక్షంలో సంబరాలు జరుపుకునేవారు. చెడు జరిగితే, జంతు బలులతో తల్లికి శాంతులు జరిపించేవారు. కాలప్రవాహంలో ఆ తెగలు అంతరించిపోయాయి. జూబ్లీహిల్స్ అత్యంత ఖరీదైన ప్రాంతంగా మారింది. కానీ, అలనాటి అమ్మతల్లి ఆనవాళ్లు మాత్రం మిగిలాయి. రెండున్నర దశాబ్దాల క్రితం దాకా.. ఇక్కడో చిన్న ఆలయం ఉండేదట. ఎవరైనా వచ్చి వెలిగిస్తే దీపం వెలిగేది, లేదంటే లేదు. ఆ సమయంలో... రాత్రిళ్లు అమ్మ అడుగుల సవ్వడులు వినిపించేవని స్థానికులు చెబుతారు. భక్తులకు కల్లో కనిపించి ... తనకో ఆలయాన్ని నిర్మించమని ఆదేశించిందట.

**పీజేఆర్ చొరవతో...** కాంగ్రెస్ దివంగత నేత పి.జనార్దన్‌రెడ్డికి అమ్మవారంటే మహా భక్తి. తల్లి ప్రేరణతో ఆయన ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. 1993లో ప్రారంభమైన నిర్మాణం ఏడాదికల్లా పూర్తయింది. హంపీ విరూపాక్ష స్వామి చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఐదు అంతస్తుల ఎత్తులో గర్భగుడి, ఏడంతస్తుల్లో రాజగోపురం, గణపతి - లక్ష్మి - సరస్వతి ఆలయాలు ప్రాణంపోసుకున్నాయి. నిజానికి, ప్రభుత్వం అప్పట్లో ఇక్కడ ఉన్నతాధికారుల నివాస సముదాయాన్ని ఏర్పాటు చేయాలనుకుంది. పీజేఆర్ ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. పట్టుబట్టి .. అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. పెద్దమ్మ దేవస్థానంలో దసరా నవరాత్రులు, శాకంబరి ఉత్సవాలు, ఆషాఢ బోనాలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి మంగళవారం నాగదోష పూజలు చేస్తారు. మాఘశుద్ధ పంచమి నుంచి సప్తమి వరకు వార్షిక రథోత్సవం కన్నులపండువగా జరుగుతుంది. మంగళ శుక్రవారాల్లో పదిహేనువేల మందీ, పర్వదినాల్లో లక్ష మందీ అమ్మవారిని దర్శించుకుంటారు.

# చందన రూపుడు.. సింహాచలేశుడు





దేశంలోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ విశాఖపట్నం నగరానికి 11 కి.మీల దూరంలో తూర్పు కనుమల్లోని సింహగిరిపై సముద్రమట్టానికి 800 అడుగుల(244మీ)ఎత్తున ప్రశాంత వాతావరణంలో శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. సింహాచలం ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా ఉంది. విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే వరాహ లక్ష్మీనరసింహస్వామి ఇక్కడ కొలువై ఉన్నాడు. నిత్యం చందనంతో కప్పబడి కనిపించే ఈ స్వామి నిజరూప దర్శన సమయాన్ని చందన యాత్ర లేదా చందనోత్సవం అని అంటారు. ఇది ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ (మే నెలలో) వస్తుంది.

**ఆలయ చరిత్ర-స్థల పురాణం :** స్వయంభూవైన సింహాచల శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి ఇక్కడ 11వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం బట్టి తెలుస్తోంది. కళింగ శైలిలో నిర్మించిన ఈ ఆలయం అద్భుతమైన శిల్ప కళ, అందమైన గోపురాలతో భక్తులకు కనువిందు చేస్తుంది. ఆలయంలో పలు చారిత్రక సందర్భాల్లో వేసిన శిలా శాసనాలు చారిత్రక పరిశోధకులను ఆకర్షిస్తాయి. సత్యకాలంలో వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన నృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ నృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ రోజూ నాలుగువేదాలు, నాలాయిర దివ్య ప్రబంధాలు, పురాణాలు స్వామి వారి సన్నిధిలో పారాయణ చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన వైష్ణవ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. తిరుపతి తర్వాత అత్యధిక ఆదాయం (రూ.52 కోట్లు)కలిగిన దేవాలయమిదే. ఏడాది మొత్తంలో 12 గంటలు మాత్రమే దేవుడి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తుంది. శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారు ఏడాదిలో 364 రోజులు సుగంధ భరిత చందనంతో కప్పబడి ఉంటారు. భక్తులకు నిత్యం దర్శనం ఇచ్చేది.. ఈ చందన అవతారంలో వుండే స్వామి వారే. ఏటా ఒక్క వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే.. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ ఆ నిజరూప దర్శనం ఉంటుంది. స్వామి వారి నుంచి తొలగించిన గంధాన్ని చందన ప్రసాదంగా భక్తులకు అందజేస్తారు. అలాగే గిరి ప్రదక్షిణ కూడా ఇక్కడ ప్రత్యేకంగా జరిగే ఉత్సవం. మిగతా సమయాల్లోనూ ఎంతో రద్దీగా ఉండే సింహాచలం ఆలయం ఈ రెండు సందర్భాల్లో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బంగా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షల మంది భక్తులతో మరింత రద్దీగా మారుతుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలు ఉంటాయి. ఆలయంలో కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకొని కోరికలు కోరుకుంటే అవి తీరుతాయనేది భక్తుల విశ్వాసం.

**ప్రధాన పూజలు :** 1. స్వామి వారి నిత్యకల్యాణం: టిక్కెట్టు ధర రూ.1000, రోజూ జరిగే ఈ సేవలో స్వామివారి పట్టు శేష వస్త్రం, చీర, రవికె, 80 గ్రాముల బరువు ఉండే 6 లడ్డూలు, 2 పులిహోర ప్యాకెట్లు, ఆరుగురికి ఉచిత దర్శనం, అన్నదానంలో ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తారు.

2. స్వర్ణ పుష్పార్చన: టిక్కెట్టు ధర రూ.1116, ప్రతి గురువారం ఉదయం 7 గంటల నుంచి గంటపాటు జరుగుతుంది. పాల్గొన్న వారికి కండువా, రవికె, 2 లడ్డూలు, 2 పులిహోర ప్యాకెట్లు ఉచితంగా అందజేస్తారు.

**ఇతర సేవల ధరలు** సహస్రనామార్చన: రూ.200, అష్టోత్తర శతనామార్చన: రూ.100, లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన: రూ.50, గరుడ సేవ: రూ.300, కప్పస్తంభ ఆలింగనం: రూ.25, లక్ష్మీనారాయణ వ్రతం: రూ.50, గోపూజ: రూ.50 గోసంరక్షణ పథకం విరాళం: రూ.1116, పశువుకట్టు: రూ.15, అన్నప్రాశన, అక్షరాభ్యాసం: రూ.50. ద్విచక్రవాహన పూజ: రూ.100, కారు పూజ: రూ.200
కేశఖండన: రూ.10

**టిక్కెట్లు దొరికే స్థలాలు:** అన్ని పూజా టిక్కెట్లు ఆలయంలోని కప్పస్తంభం వద్ద ఇస్తారు. రూ.100 దర్శనం టిక్కెట్లను గాలిగోపురం వద్ద ప్రత్యేక కౌంటర్లో ఇస్తారు. రూ.20 టిక్కెట్లు క్యూలైన్ల మధ్యలోనే ఇస్తారు.

**ప్రసాదాల ధరలు :** లడ్డూ(80గ్రాములు): రూ.5, పులిహోర : రూ.5, చక్కెర పొంగలి: రూ.3, రవ్వ లడ్డూ : రూ.2, దర్శన వేళలు , ఉదయం 6.30 నుంచి 11.30 వరకు సర్వదర్శనం, ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు రాజభోగం సందర్భంగా అరగంట పాటు దర్శనాలు నిలుపుదల చేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 2.30 వరకు సర్వదర్శనం. మధ్యాహ్నం 2.30 నుంచి 3 వరకు పవళింపు సేవ. దర్శనాలు ఉండవు . సాయంత్రం 3 నుంచి రాత్రి 7 వరకు సర్వదర్శనం. రాత్రి 7 నుంచి 8.30 వరకు ఆరాధన. దర్శనాలు లభించవు. రాత్రి 8.30 నుంచి 9 వరకు సర్వదర్శనం. రాత్రి 9.00 పవళింపు సేవ జరిగి తలుపులు మూసివేస్తారు. మరలా ఉదయం 6.30కి యథావిధిగా దర్శనాలు లభిస్తాయి. దర్శనం టిక్కెట్ల ధరలు,రూ.100 గాలిగోపురం నుంచి అంతరాలయంలోకి ప్రవేశం. రూ.100 అష్టోత్తరం టిక్కెట్టు. అంతరాలయంలో గోత్రనామాలతో పూజ చేస్తారు. రూ.20 సాధారణ క్యూలైన్ల నుంచి ఆలయంలోకి ప్రవేశం.

**రవాణా సౌకర్యం :** సింహాచల క్షేత్రం విశాఖపట్నం ద్వారా నౌకా, రైలు, రోడ్డు, విమాన మార్గాల్లో అనుసంధానమై ఉంది. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కేవలం 11 కి.మీ, విశాఖ ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి 11 కి.మీ, విశాఖపట్నం బస్ స్టేషన్ నుంచి 12 కి.మీ దూరంలో ఉంది. సింహాచలానికి 5 కి.మీల దూరంలో గోపాలపట్నం వద్ద సింహాచలం రైల్వే స్టేషన్ కూడా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి సింహాచలానికి విస్తృత రవాణా సదుపాయం ఉంది. అన్ని చోట్ల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ప్రైవేట్ క్యాబ్‌లు, ఆటోలతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా వుంది. సింహాచలం కొండ దిగువ నుంచి ఎగువకు మాత్రం సింహాచలం దేవస్థానమే ప్రత్యేక వాహనాలను నడుపుతోంది. సొంత వాహనాలు ఉంటే నామమాత్రపు (రూ.10) టోల్ రుసుము చెల్లించి ఆ వాహనాల్లోనే చేరుకోవచ్చు. కొండ పైకి చేరుకునేందుకు దేవస్థానం వారు నాలుగు, ఆర్టీసీ వారు 20 బస్సులు నడుపుతున్నారు. ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. ఇక చందనోత్సవం, గిరి ప్రదక్షిణ, ముక్కోటి ఏకాదశి, బ్రహ్మోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆర్టీసీ మరిన్ని ప్రత్యేక సర్వీసులు నడుపుతుంది. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా స్వామివారి ఆలయ గాలిగోపురం పక్కన లిఫ్టు సౌకర్యం ఏర్పాటు చేశారు.

**వసతి వివరాలు :** కొండపై సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే పలు సత్రాలు ఉన్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చందన టూరిస్టు రెస్ట్ హౌస్, తితిదే సత్రాలు ఉన్నాయి. కొండ కింద పలు ప్రైవేటు వసతి గదులు అందుబాటులో వున్నాయి.

**ఇతర దర్శనీయ స్థలాలు :** ఆండాళ్ సన్నిధి(గోదాదేవి), సింహవల్లీ తాయారు సన్నిధి, లక్ష్మి నారాయణ సన్నిధి, త్రిపురాంతక స్వామి ఆలయం, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, శ్రీసీతారామస్వామి ఆలయం, గంగాధర, అడివివరం గ్రామం నుంచి 3 కి.మీల దూరంలో భైరవస్వామి సన్నిధి, కొండ దిగువ న వరాహ పుష్కరిణి, కొండ మెట్ల మార్గంలో ఆంజనేయ స్వామి ఆలయం, కొండపై శ్రీకృష్ణదేవరాయలు వేయించిన విజయ స్థూపం, సింహాచలానికి 8 కి.మీ దూరంలో శ్రీమాధవ స్వామి, వేణుగోపాల స్వామి, మల్లికార్జున స్వామి ఆలయాలు ఇక్కడికొచ్చే పర్యాటకులు, భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

**పరిసరాల్లోని దర్శనీయ స్థలాలు :** ఇక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరున్న విశాఖపట్నం, భీమిలి బీచ్, తొట్లకొండ బౌద్ధారామం, తదితరాలు ఉన్నాయి. ఇవి కాక, ఆంధ్రా ఊటీగా పేరున్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, బొర్రా గుహలు, అరకులోయ (సుమారు 100 కి.మీ) వెళ్లడమూ సౌలభ్యంగా ఉండటం సింహాచలం వచ్చే పర్యాటకులకు కలిసొచ్చే అంశాలుగా చెప్పుకోవచ్చు.

# ద్వివిధుడి వధ



ద్వివిధుడనే వానరుడు నరకాసురుడికి నమ్మకమైన స్నేహితుడిగా ఉండేవాడు. కృష్ణుడి చేతిలో నరకుడు హతమైపోయాక, తన మిత్రుణ్ణి చంపిన కృష్ణుడి మీద, అతడి పరివారమైన యాదవుల మీద పగబట్టాడు. కృష్ణుడి ఆనర్త దేశంలో అడపా దడపా నానా బీభత్సం సృష్టించేవాడు. పొలాల మీద పడి పంటలు నాశనం చేసేవాడు. ఊళ్లకు ఊళ్లను తగులబెట్టేవాడు. ఉద్యానవనాల్లోకి చొరబడి వాటిని ధ్వంసం చేసేవాడు. ద్వారక మీదకు రాళ్లు రువ్వేవాడు. ఆలమందలను చెదరగొట్టేవాడు. ఇలా నానా ఆగడం చేసి, చెట్ల మీద నుంచి గెంతుతూ ఎవరకీ దొరక్కుండా క్షణాల్లో పారిపోయేవాడు. ఇలా ఉండగా, ఒకసారి బలరాముడు ప్రియురాళ్లతోను, వాళ్ల చెలికత్తెలతోను కలసి రైవత పర్వతం మీదకు వనవిహారానికి వెళ్లాడు. సముద్రం మీద నుంచి వీచే చల్లగాలి హాయిగొలుపుతుండగా, అందరూ కొండ మీద చదునైన చోట కూర్చుని సేదదీరసాగారు. బలరాముడు హాయిగా మధువు తాగుతూ, ఆ తన్మయత్వంలో పాటలు పాడసాగాడు. బలరాముడి సంగీతానికి అనుగుణంగా ప్రియురాళ్లు నాట్యం చేయసాగారు. వారి వినోద కాలక్షేపం పాన గానాలతో ఆహ్లాదభరితంగా సాగుతుండగా, ఎక్కడి నుంచి చూశాడో ద్వివిధుడు చెట్ల మీద నుంచి దూకుతూ రైవత పర్వతం మీదకు చేరుకున్నాడు. కొండ మీదనున్న చెట్లపై వేలాడుతూ, ఒక చెట్టు మీద నుంచి మరో చెట్టు మీదకు దూకుతూ కోతిచేష్టలు మొదలుపెట్టాడు. చెట్లను బలంగా ఊపుతూ, వాటికి ఉన్న పండ్లను దులిపేశాడు. పూలను రాల్చేశాడు. ఆడవాళ్ల ఎదుటికొచ్చి చిందులు వేశాడు. వాళ్లు అతణ్ణి వింతగా చూశారు. కొందరు నవ్వారు. ఇంత జరుగుతున్నా బలరాముడు తన మైకంలో, తన లోకంలో తానుండి హాయిగా గానాలాపన సాగిస్తూనే ఉన్నాడు. తాను ఎంత ఆగడం చేస్తున్నా, బలరాముడు చలించకపోవడంతో ద్వివిధుడు చిర్రెత్తిపోయాడు. ఏకంగా బలరాముడి ఎదుటికే వచ్చి, జబ్బలు చరుచుకుని రంకెలు వేశాడు. కాళ్లు నేలకు తాటిస్తూ, కయ్యానికి కాలు దువ్వాడు. ఈ చేష్టలను బలరాముడు అరమూత కళ్లతో ఒకసారి చూసి, తన మానాన పాడుకోసాగాడు. ద్వివిధుడు మరింతగా కోపంతో పెట్రేగి ఊగిపోయాడు. పళ్లు పటపట కొరికాడు. బలరాముడి ముందున్న మధుపాత్రను పైకెత్తి నేలకేసి కొట్టాడు. మధుపాత్ర పగిలి, మధువు నేలపాలైంది. ఏదో ఘనకార్యం చేసినట్టు వికటాట్టహాసం చేశాడు. రెప్పలెత్తి చూశాడు బలరాముడు. మామూలు కోతిని అదిలించినట్లుగానే, పక్కనే ఉన్న ఒక చిన్నరాయిని తీసుకుని అదిలించాడు. బలరాముడి ధోరణికి ద్వివిధుడు బాగా రెచ్చిపోయాడు. ఈసారి ఆడవాళ్ల గుంపులోకి దూకాడు. వాళ్లను మిర్రి మిర్రి చూస్తూ కిచకిచలాడాడు. బెదిరిస్తున్నట్లుగా పైపైకి వచ్చాడు. గంతులు వేశాడు. వాళ్లు ఇదంతా వినోదంగా అనుకుంటున్నంతలోనే ఒక్కసారిగా వాళ్ల జడలు గుంజి, చీరలు చించేశాడు. మీదపడి దొరికిన వాళ్లను దొరికినట్లుగా గోళ్లతో రక్కాడు. వానరం ఆగడం మితిమీరడంతో వాళ్లంతా హాహాకారాలు చేస్తూ, ఏడుపు మొదలుపెట్టారు. అప్పుడు వాణ్ణి తేరిపార చూశాడు బలరాముడు. దేశంలో ఆగడాలు సాగిస్తున్న వానరుడు వీడేనని గుర్తించాడు. ఆడవాళ్ల మీద ఆగడం సాగిస్తుండటంతో ఏమాత్రం సహించలేకపోయాడు. ఇక ఆలస్యం చేయకుండా, ఒక చేత నాగలి, మరో చేత ముసలం పట్టుకుని పైకి లేచాడు. బలరాముడు ఆయుధాలతో పైకి లేవడం గమనించిన ద్వివిధుడు, ఒక భారీ గుగ్గిలం చెట్టును పెరికి, బలరాముడి మీదకు విసిరాడు. ఎడమచేత్తో దాన్ని అడ్డుకున్నాడు బలరాముడు. ఒక మద్దిచెట్టును విసిరాడు. దాన్ని ముసలంతో నేలకూల్చేశాడు బలరాముడు. ఒక్క ఊపుతో ముందుకు దూసుకొచ్చాడు ద్వివిధుడు. ముసలంతో చాచిపెట్టి వాడి నెత్తి మీద కొట్టాడు బలరాముడు. వాడి తల పగిలి నెత్తురోడసాగింది. అయినా లక్ష్యపెట్టలేదు వాడు. భయంకరంగా పెడబొబ్బలు పెడుతూ, చెట్టు మీద చెట్టు పెరికి బలరాముడి మీదకు దండెత్తాడు. చుట్టు పక్కల చెట్లన్నీ ఖాళీ అయిపోయాక, పెద్ద పెద్ద బండరాళ్లు విసిరి ఊపిరాడనివ్వకుండా చేశాడు. అంతటితో ఆగకుండా బలరాముడి మీదకు దూకి, నేలకేసి అదిమి పిడిగుద్దులు కురిపించాడు. ఉపేక్షిస్తున్న కొద్దీ వానరం రెచ్చిపోతుండటంతో బలరాముడికి కోపం తలకెక్కింది. ఆగ్రహంతో కళ్లెర్రచేసి, కాలసర్పంలా బుసకొట్టాడు. ద్వివిధుడి మీద పిడుగుల్లా పిడిగుద్దులు కురిపించాడు. ఇద్దరూ కచాకచీ బాహాబాహీ ఒకరితో ఒకరు తలపడ్డారు. రైవతపర్వతం అదిరిపోయేలా రంకెలు వేస్తూ భీకరంగా ఒకరినొకరు కొట్టుకుంటూ, ఒకరినొకరు నేలపైకి పడదోసుకుంటూ యుద్ధం సాగించారు. ఒకరినొకరు తన్నుకుంటూ, చరుచుకుంటూ, పిడిగుద్దులు గుద్దుకుంటూ కలియబడ్డారు. అదను చూసుకుని బలరాముడు ద్వివిధుణ్ణి ఒడుపుగా పట్టుకుని, నేలకేసి తోశాడు. పైకి లేచే లోగానే అతడిపై కలబడ్డాడు. అతడి గుండెల మీద కూర్చుని, లేవనివ్వకుండా అతణ్ణి కట్టడి చేశాడు. ప్రతిఘటించేలోపే వ్యవధినివ్వకుండా పిడిగుద్దులు కురిపించాడు. గుండెల మీద పిడుగులాంటి పోటు పిడికిటితో పొడిచాడు. దెబ్బకు నెత్తురు కక్కుకుంటూ, భీకరంగా అరుస్తూ ప్రాణాలు వదిలాడు ద్వివిధుడు. బలరాముడి చేతిలో వానరం హతమవడంతో అతడితో కొండ మీదకు వచ్చిన ఆడవాళ్లంతా ఊపిరి పీల్చుకున్నారు. బలరాముడిని పొగుడుతూ ఆనందంతో పాటలు పాడారు. యుద్ధంలో అలసిపోయిన బలరాముడికి సపర్యలు చేశారు. కొండ మీద కాసేపు సేదదీరాక, తిరిగి ద్వారకకు మళ్లారు.

# భయారణ్యం..

## ఇదో ఆత్మహత్యల అడవి



ప్రపంచంలోని చాలా వింతలు, రహస్యాలు తదనంతర కాలంలో వణుకు పుట్టించే గాథలుగా ప్రచారంలోకి వస్తాయి. అలాంటిదే జపాన్ లోని ఓకిగహారా అడవి. దీనికే సూసైడ్ ఫారెస్ట్ అనే పేరూ ఉంది. ఈ అడవిలోకి అడుగుపెట్టిన మొదట్లోనే 'మీ పిల్లలు, కుటుంబం గురించి ఒకసారి ఆలోచించండి, మీ జీవితం మీ తల్లిదండ్రులు మీకు ఇచ్చిన విలువైన బహుమతి' అనే కొటేషన్స్ కనపడతుంటాయి. ఎందుకంటే ఈ అడవి ప్రపంచంలోని ఆత్మహత్యల ప్రదేశాలలో రెండవ స్థానంలో ఉంది. జపాన్ రాజధాని టోక్యో నుంచి రెండు గంటల దూరంలో ఫుజీ పర్వతానికి వాయవ్యంలో ఉన్న ఈ అడవి.. 35 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. ఇది చాలా దట్టంగా, అందంగా ఉంటుంది. అధికారిక రికార్డుల ప్రకారం.. ఈ అడవిలో సుమారు 105 మృతదేహాలు లభించాయి. ఈ అడవిలో మొబైల్ ఫోన్ పని చేయదు. దాంతో అడవిలో చిక్కుకున్న వారు బయటికి రావడం అసాధ్యం. రాత్రిపూట అడవి నుంచి అరుపులు, వింత శబ్దాలు వస్తాయని స్థానికులు చెబుతుంటారు. ఈ వనంలో 300 సంవత్సరాల కిందటి పురాతన జాతుల చెట్లు ఉన్నాయని సమాచారం. అయితే ఈ అడవిలో ఉన్న మిస్టరీ ఏంటో నేటికీ కనిపెట్టలేకపోయారు.

## రోబో రెస్టారెంట్ : రోబోలతో ఆహారం సరఫరా!



న్యూఢిల్లీ : కరోనా మహమ్మారితో భౌతిక దూరం పాటించడం అనివార్యం కావడంతో వెయిటర్స్‌గా రోబోలను ప్రవేశపెడుతూ నోయిడాలో ఓ రెస్టారెంట్ వెలిసింది. నోయిడాలోని సెక్టార్ 104లో యల్లో హౌస్ పేరుతో రోబో రెస్టారెంట్‌ను లాంఛ్ చేయడంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో రోబోటిక్ వెయిటర్స్‌తో తొలి రెస్టారెంట్ అందుబాటులోకి వచ్చింది. జైపూర్‌లో మూడు రెస్టారెంట్లను విజయవంతంగా నిర్వహించిన మల్టీక్యూజిన్ రెస్టారెంట్ చైన్ నోయిడాకు విస్తరించింది. రెస్టారెంట్‌లో రెండు రోబోలు ఫుడ్ సర్వ్ చేస్తూ టేబుల్స్ దగ్గర సేవలు అందిస్తాయి. ఈ రోబోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేస్తాయని రెస్టారెంట్ యజమాని జిషు ఆనంద్ తెలిపారు. ప్రతి టేబుల్ నుంచి డేటాను రోబోల్లో ఫీడ్ చేస్తారు. టేబుల్ నెంబర్‌ను ఫోన్ లేదా ట్యాబ్లెట్‌లో ఎంటర్ చేయగానే రోబోలు ఆయా టేబుల్స్ వద్దకు వెళ్లి ఆహారాన్ని అందిస్తాయి. రెండు, మూడు గంటల చార్జింగ్‌తో రోబోలు రోజంతా సేవలు అందిస్తాయి.

## అసలే ఎండాకాలం..

# చుండ్రు సమస్యా?

### - సులభైన 2 చిట్కాలు మీకోసం



అరకప్పు మెంతులను రాత్రంతా నానబెట్టి ఉదయం నీళ్లు తీసేసి మెత్తగా రుబ్బుకోవాలి. దీనిలో కొద్దిగా నిమ్మరసం వేసి కలిపి కుదుళ్ల నుంచి జుట్టు చివర్ల వరకు పట్టించాలి. అరగంట తరువాత సాధారణ షాంపుతో తలస్నానం చేయాలి. అరకప్పు



నానిన మెంతులను పేస్టులా రుబ్బుకోవాలి. దానికి, పావు కప్పు అలోవెరా పేస్టు కలిపి కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. అరగంట తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఈ రెండు ప్యాక్‌లలో ఏదైనా ఒకదానిని వారానికి రెండుసార్లు తలకు అప్‌ల్కై చేయడం వల్ల చుండ్రు తగ్గుముఖం పడుతుంది. దురద కూడా తగ్గుతుంది.



## ఉత్సాహాన్నిచ్చే పోటాషియం కావాలా?

# బనానా కివీ స్మూతీ రెడీ చేస్కోండి!







**కావలసినవి:** పాలు కప్పు, అరటిపండు ఒకటి, కివి ఒకటి, తేనె మూడు టేబుల్ స్పూన్లు, లేతపాలకూర కప్పు, ఆవకాడో అర చెక్క, ఐస్‌క్యూబ్స్ కప్పు.

**తయారీ:** అరటిపండు, కివి తొక్కతీసి ముక్కలుగా తరగాలి పాలకూరను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ఇప్పుడు బ్లెండర్ తీసుకుని అరటిపండు, కివి ముక్కలు వేయాలి. దీనిలోనే పాలకూర, అవకాడోను ముక్కలు తరిగి వేయాలి. వీటన్నింటిని మెత్తగా గ్రైండ్ చేయాలి అన్నీ మెత్తగా నలిగాక పాలు, ఐస్‌క్యూబ్స్ వేసి మరొసారి గ్రైండ్ చేసి ..గ్లాసులో పోసుకోవాలి. దీనిలో తేనె వేసి బాగా కలిపి సర్వ్ చేసుకుంటే చాలా రుచిగా ఉంటుంది. తక్కువ క్యాలరీలు తీసుకోవాలనుకున్నవారికి ఈ స్మూతీ మంచి డ్రింక్ గా పనిచేస్తుంది. దీనిలో క్యాలరీలు, సోడియం తక్కువగా ఉండి పోషకాలు అధికంగా ఉంటాయి. విటమిన్ బి, సి, పీచుపదార్థంతోపాటు పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది. పొటాషియం జీవనశైలిని మరింత ఉత్సాహపరుస్తుంది. గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. కండరాలను సంరక్షిస్తుంది. అరటి, కివిలలో రెండు రకాల పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణక్రియను క్రమబద్ధీకరిస్తాయి.

# కొత్త ప్రక్రియలతో

## ఆస్తమాను ఇలా అధిగమించవచ్చు..!



ఆస్తమా అదుపు చేయడానికి మందులు, స్టెరాయిడ్స్, ఇన్‌హేలర్స్ వంటి సంప్రదాయ మందులు వాడటం మామూలే. ఇప్పటికీ ఇవి అందుబాటులో ఉన్నాయి. అయితే మరికొన్ని కొత్త కొత్త ప్రక్రియల ద్వారా ఆస్తమాను అదుపు చేయడం ఇప్పుడు మరింత తేలికగా మారింది. ఈ కొత్త ప్రక్రియలను తెలుసుకుందాం. తీవ్రమైన ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఇప్పుడు బ్రాంకియల్ థర్మోప్లాస్టీ, బయలాజిక్ మెడిసిన్ అనే రెండు ఆధునిక చికిత్స ప్రక్రియలు అందుబాటులోకి వచ్చాయి. వీటి సహాయంతో ఆస్తమా కాస్తంత తీవ్రమైన సమస్యగా ఉన్నవారు కూడా సాధారణ జీవితం గడపడం సాధ్యమవుతుంది. బ్రాంకియల్ థర్మోప్లాస్టీ ప్రక్రియలో ఒక ప్రత్యేకమైన పరికరం సహాయంతో శ్వాసనాళపు గోడల్ని వేడి చేస్తారు. ప్రోబ్ అనే పరికరాన్ని బ్రాంకోస్కోప్ సహాయంతో లోపలికి పంపుతారు. అది అక్కడ వేడిమిని వెలువరిస్తుంది. ఆ వేడిమి తో శ్వాసమార్గంలో చేరిన అదనపు మ్యూకస్‌ను తొలగిస్తుంది. ఫలితంగా శ్వాస తీసుకునే నాళం విశాలంగా తెరుచుకుంటుంది. దాంతో హాయిగా శ్వాస పీల్చుకోవడం సాధ్యపడుతుంది. ఈ ప్రక్రియను మూడు వారాల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మూడు దఫాల చికిత్స పూర్తయ్యేసరికి తీవ్రమైన ఆస్తమా వ్యాధి లక్షణాలు బాగా తగ్గిపోతాయి. మంచి ఉపశమనం దొరుకుతుంది. జీవననాణ్యత గణనీయంగా పెరగడంతో పాటు, ఆస్తమా అటాక్స్ తగ్గుతాయి. దాంతో ఆసుపత్రిలో చేరాల్సిన అవసరాలూ తగ్గుతాయి. ఈ చికిత్స ఫలితాలు చాలా కాలం... అంటే దాదాపుగా ఎనిమిదేళ్లు ఉంటాయి. ఇన్‌హేలర్స్ వాడినప్పటికీ పెద్దగా ప్రయోజనం కనిపించని, పద్దెమినిమిదేళ్లు పైబడిన యుక్తవయస్కులైన బాధితులకు ఎవరికైనా ఈ చికిత్స అందించవచ్చు. అలాగే ఇప్పుడు బయోలాజిక్ మెడిసిన్స్ అనే కొత్తరకం మందులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఆస్తమా వ్యాధిగ్రస్తుల్లో శ్వాసనాళాల వాపు కారణంగా ఆ నాళాలు సన్నబడతాయి. ఆ వాపును ఈ మందులు తగ్గించడం ద్వారా ఆస్తమాను అదుపు చేస్తాయి.

## కాలేయం కోసం

# కాస్త శ్రద్ధ ఇలా...

?



మధ్యవయసు దాటాక వయసుతో పాటు దేహంలో కొవ్వు కూడా పెరుగుతుంది. ఇదే కొవ్వు కాలేయంలోని నార్మల్ కణాల్లో కూడా పెరుగుతూ, పేరుకుపోతూ ఉండవచ్చు. అదే ఫ్యాటీలివర్. కొన్నిసార్లు అది రక్తప్రవాహానికీ అడ్డురావచ్చు. అప్పుడు కాలేయం ఆకృతి, దాని స్వాభావికమైన రంగు దెబ్బతినవచ్చు. కాస్త గట్టిగా లేదా జిగురు జిగురుగా, పచ్చరంగుకు మారవచ్చు. ఆ కండిషన్‌నే సిర్రోసిస్ అంటారు. కొన్నిసార్లు దేహంలోకి చాలా ప్రమాదకరమైన విషాలు ప్రవేశించడం వల్ల గానీ, కొన్ని వ్యాధులు లేదా ఇన్ఫెక్షన్స్ వల్ల, తగినంత ఆహారం తీసుకోకుండా, మితిమీరిన ఆల్కహాల్ తీసుకోవడం వల్ల కూడా సిర్రోసిస్ రావచ్చు. అలాంటి సమయంల్లో దేహంపైన సాలీడు ఆకృతిలో రక్తనాళాలు బయటకు కనిపించవచ్చు. ఆకలి లేకపోవడం, నీరసం, నిస్సత్తువ, పొట్టలో విపరీతంగా గ్యాస్ పేరుకుపోవడం, కళ్లు పసుపు రంగులో ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తుంటే డాక్టర్‌ను సంప్రదించాలి. అప్పుడు డాక్టర్‌లు లివర్ ఫంక్షన్ టెస్ట్ వంటి కొన్ని పరీక్షలు చేసి కాలేయం పనితీరు తెలుసుకుంటారు. కాలేయం పనితీరు బాగుంటే ఫరవాలేదు. ఒకవేళ ఫ్యాటీలివర్ ప్రాథమిక దశలో ఉన్నా అంతగా ప్రమాదం ఉండదు. బరువు పెరగడాన్ని నియంత్రించుకోవాలి. మద్యం పూర్తిగా మానేయాలి. అన్నిరకాల పోషకాలు అందేలా... ముఖ్యంగా విటమిన్ బి లాంటివి అందేలా మంచి ఆహార నియమాలు పాటించాలి. రోజూ కొద్దిగా వ్యాయామం చేయాలి. ఇలా ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరిస్తూ ఉంటే కొద్దిపాటి మందులతోనే కాలేయం బాగుపడుతుంది, బాగుంటుంది. సాధారణంగా కాలేయం తాను దెబ్బతిన్న భాగాన్ని తనంతట తానే బాగుచేసుకుంటుంది.

# రెడ్ వైన్ తాగడం వల్ల ఈ ప్రయోజనాలు ఉన్నాయని సైన్స్ కూడా ఒప్పుకుంది

రెడ్ వైన్ తాగడం వల్ల ఎన్నో అనారోగ్యాలను దూరం పెట్టవచ్చని శాస్త్రీయంగా నిరూపణ అయింది. రెడ్ వైన్ తాగడం వల్ల ఈ ప్రయోజనాలు ఉన్నాయని సైన్స్ కూడా ఒప్పుకుంది రెడ్ వైన్లో ఆల్కహాల్ కలిపినదే కాదు, ఆల్కహాల్ కలపని రెడ్ వైన్ కూడా ఉంటుంది. ఆల్కహాల్ కలపని రెడ్ వైన్ తాగడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు జరుగుతుంది. ఈ విషయాన్ని సైన్స్ నిర్ధారించింది. అధ్యయనాల ప్రకారం స్త్రీలు, పురుషులు మితంగా రెడ్ వైన్ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను దూరం పెట్టవచ్చు. ఈ పానీయంలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడతాయి.



## మధుమేహుల కోసం

డయాబెటిస్ ఉన్నవారు రెడ్ వైన్ తాగవచ్చా లేదా అనే సందేహం వారిలో ఉంది. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ చెబుతున్న ప్రకారం ఆల్కహాల్ లేని రెడ్ వైన్ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు ఎంతో మంచిది. రెడ్ వైన్ రక్తంలో చక్కెరను నియంత్రించడానికి సహాయపడుతుంది. రెడ్ వైన్ తాగాక 24 గంటల వరకు రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా అదుపులో ఉంచగలుగుతుంది. అందుకే మితంగా డయాబెటిక్ రోగులు రెడ్ వైన్ తాగడం వల్ల మంచే జరుగుతుంది.

## జ్ఞాపక శక్తికి

రెడ్ వైన్లో పాలీఫెనాల్స్ ఉంటాయి. ముఖ్యంగా రెస్వరాట్రాల్ అనే పాలీఫెనాల్ అధికంగా ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. సరిగా నిద్రపోకపోవడం వల్ల జ్ఞాపకశక్తి తగ్గే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఆ శక్తిని తగ్గకుండా కాపాడుతుంది రెడ్ వైన్. అభ్యాస సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది.

## క్యాన్సర్‌కు చెక్

రెడ్ వైన్ తాగడం వల్ల శరీరంలో క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించవచ్చు. ముఖ్యంగా రొమ్ము, అన్నవాహిక క్యాన్సర్‌ను తగ్గించే సామర్థ్యం రెడ్ వైన్‌లో ఉన్నట్టు శాస్త్రీయంగా నిరూపణ అయింది.

## గుండె కోసం

రెడ్ వైన్‌లో ఉత్తమమైన పాలీఫెనాల్స్ ఉంటాయని ముందే చెప్పుకున్నాం. అవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడతాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి కొలెస్ట్రాల్ ను బయటకు పంపేందుకు ప్రయత్నిస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచేందుకు రెడ్ వైన్ ఎంతో సహాయపడుతుంది.

## కళ్ళకు

రెడ్ వైన్‌లో ఉండే రెస్వరాట్రాల్ కంటి ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. వయసు సంబంధంగా వచ్చే చూపు క్షీణత, మధుమేహం వల్ల కలిగే డయాబెటిక్ రెటినోపతి వంటి కంటి సంబంధిత సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది.

## దంతాల ఆరోగ్యానికి

రెడ్ వైన్ తాగడం వల్ల నోటిలో హానికరమైన బ్యాక్టీరియా కూడా బయటికి పోతుంది. ఆ బాక్టీరియా నోట్లో ఉంటే దంత క్షయం, చిగుళ్ల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఎక్కువ. కాబట్టి రెడ్ వైన్ తాగడం వల్ల దంతాలు కూ డా శు భ్రపడతాయి. ఆ ల్కహాల్ కలిపిన రెడ్ వైన్ తాగడం వల్ల ఇన్ని ప్రయోజనాలు కలిగే అవకాశం తక్కువ. కాబట్ట నాన్ ఆల్కహాలిక్ రెడ్ ఎ ౨ ౼ ౨ ౕ ఎంచుకుని తాగడం ఉత్తమం.

**గమనిక:** పలు అధ్యయనాలు, పరిశోధనలు, హెల్త్ జర్నల్స్ నుంచి సేకరించిన సమాచారాన్ని మీ అవగాహన కోసం ఇక్కడ యథావిధిగా అందించాం. ఈ సమాచారం వైద్యానికి లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. ఆరోగ్యానికి సంబంధించి.. ఎలాంటి సందేహాలున్నా మీరు తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. ఈ ఆర్టికల్‌లో పేర్కొన్న అంశాలకు 'ఏబీపీ దేశం', 'ఏబీపీ నెట్‌వర్క్' ఎటువంటి బాధ్యత వహించవని గమనించగలరు.

# మెదడుకు హాని చేసే ఆహారాలు ఇవే

## - వీటికి దూరంగా ఉండండి



మెదడు శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో ఒకటి. నిద్ర, తిండి దగ్గర నుంచి ఎప్పుడు ఏం చేయాలనేది నిర్ణయించేది మెదడు. అన్ని వ్యవస్థలు బాగా పని చేయడంలో సహాయపడటమే కాకుండా గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి ఇతర అవయవాలు తమ విధులను చక్కగా నిర్వహించడంలో సహాయపడుతుంది. అందుకే మెదడు ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. అందుకోసం పోషకాహారం తీసుకోవాలి. మనం తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారాలు మెదడు ఆరోగ్యంపై అద్భుతమైన ప్రభావాన్ని చూపిస్తాయి. తాజా పండ్లు, కూరగాయలు, కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు మెదడు కణజాలాన్ని నిర్మించడంలో, వాపును తగ్గించడంలో సహాయపడతాయి. పోషకాహారం తీసుకోవడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మెదడు చురుకుగా ఉంచే ఆహారం తీసుకోకపోతే డీమెన్షియా, అల్జీమర్స్, పార్కిన్సన్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయి. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 65 మిలియన్ల మందిపై చిత్త వైకల్యం ప్రభావం చూపే ప్రమాదముందని ఒక నివేదికలు వెల్లడించాయి. ఈ ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే మీ మెదడుని మీరే ప్రమాదంలోకి నెట్టుకున్న వాళ్ళవుతారు. అలాగే తరచూ ఈ పదార్థాలు తీసుకుంటే మెదడుని ఆరోగ్యంగా ఉంచుతుంది.

## మెదడుకి ఉత్తమమైన ఆహారాలు

### బెర్రీలు

బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి మెదడు శక్తిని పెంచుతాయి. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, బ్లాక్ బెర్రీస్ వంటి బెర్రీ పండ్లు సలాడ్, లేదా అల్పాహారం కోసం స్మూతీస్ లో తీసుకోవచ్చు. ముదురు రంగు పండ్లలో ఫ్లేవనాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మంటని తగ్గించడంలో సహాయపడతాయి. మెదడు పనితీరుని వేగవంతం చేస్తాయి.

### గుడ్లు

ప్రోటీన్స్ కి గుడ్లు పవర్ హౌస్ లాంటివి. రుచికరంగా ఉండటంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కొలిన్, లూటిన్ వంటి పోషకాలతో నిండిన గుడ్లు మెదడు పనితీరుకి మద్దతునిస్తాయి. ఏకాగ్రత పెంచుకునేందుకు రోజుకొక గుడ్డు తింటే మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

### కొవ్వు చేపలు

సాల్మన్, ట్యూనా వంటి కొవ్వు చేపల్లో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి మెదడు ఆలోచనా శక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అభిజ్ఞా క్షీణతని నెమ్మదించేలా చేస్తుంది. మెదడు వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. కొవ్వు ఆమ్లాలు పొందటం కోసం ఆహారంలో చేపలు చేర్చుకోవాలని సిఫార్సు చేస్తున్నారు.

### నట్స్

ఆరోగ్య ప్రయోజనాలు అందించడంలో ముందుండేవి నట్స్. రోజువారీ ఆహారంలో నట్స్ చేర్చుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. వాల్ నట్స్ మెదడుకి సూపర్ ఫుడ్. ఇతర గింజలలో లేని వివిధ రకాల పాలీఫెనాలిక్ సమ్మేళనాలు ఇందులో లభిస్తాయి. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు ఇవి రెండు బలమైన యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలని కలిగి ఉంటాయి. వాల్ నట్స్ తినడం వల్ల మతిమరుపు, అభిజ్ఞా క్షీణత వంటి సమస్యల నుంచి బయటపడొచ్చు.

### చక్కెర

చక్కెర, సోడా, ఎనర్జీ డ్రింక్స్, పండ్ల రసాలు మెదడుకి మాత్రమే కాదు సాధారణ ఆరోగ్యానికి కూడా హాని చేస్తాయి. చక్కెర పానీయాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మధుమేహం, గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. బరువు పేరుగుతారు. చక్కెర పానీయాలు అధికంగా తీసుకోవడం వల్ల అల్జీమర్స్, చిత్త వైకల్యం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

### ప్రాసెస్ చేసిన ఆహారాలు

చిప్స్, స్వీట్లు, ఇన్స్టంట్ నూడుల్స్, సాస్, రెడీ మేడ్ మీల్స్ వంటి ప్రాసెస్ చేసిన ఆహారాలు మొత్తం ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి. వీటిలో కెలరీలు ఎక్కువగా ఉంటాయి. పోషకాలు తక్కువ. మెదడు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.

### మద్యం

ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లు మెదడు పనితీరుకి ఆటంకం కలిగిస్తాయి. దీర్ఘకాలికంగా మద్యపానం చేయడం వల్ల జీవక్రియలో మార్పులు సంభవిస్తాయి. మెదడుని దెబ్బతీస్తుంది.

# పది నిమిషాల్లోనే నోరూరించే చాకోచిప్ కుకీస్

నచ్చిన వంటలు చేసుకుని తినడంలో వచ్చే కిక్కే వేరు. ఇక ప్రస్తుతం లాక్‌డౌన్‌లో ఇంట్లో బోరింగ్ ఫీల్ అవుతున్నవారు రకరకాల వంటలతో బిజీగా గడుపుతున్నారు. సాధారణ ప్రజల నుంచి సెలబ్రిటీల వరకు లాక్‌డౌన్‌లో గరిటె తిప్పడంపై శ్రద్ధ పెడుతున్నారు. వంటలు, స్నాక్స్, సలాడ్స్ ఇలా ఎన్నో రకాల రుచికరమైన వాటిని చేసుకుని ఎంజాయ్ చేస్తున్నారు. అయితే ఎప్పుడూ ఒకే విధమైన వంటకాలు చేయడం నచ్చలేని వాళ్లు కొత్తగా ఏదైనా తయారు చేయాలనుకుంటారు. అలాంటి వారు ఓ సారి చాకోచిప్ కుకీలను తయారు చేసి చూడండి. ఇది తెలిసిన వంటకమే అయినా తక్కువ పదార్థాలతో, చాలా తొందరగా చేయడం తెలిస్తే ఇక ఎప్పుడు దీనిని వదలరు. ఈ రకమైన బిస్కెట్లు తయారు చేయడానికి కేవలం పది నిమిషాలే సరిపోతుంది. అలాగే దీనికి ఓవెన్, ఎగ్స్ కూడా అవసరం లేదు. కావున శాఖాహార ప్రియులు కూడా లాగించేయవచ్చు. చిన్న వాళ్ల నుంచి ముసలి వాళ్ల వరకు అందరికి ఈ చాకోచిప్ కుకీలు నచ్చుతాయి. బయట భాగంలో క్రంచీగా, లోపల మృదువుగా ఉంటాయి. దీని తయారీకి మీకు కావలిసిందల్లా కేవలం మూడు పదార్థాలు. మరి అవేంటో తెలుసుకుందాం. **దీనికి కావాల్సిన పదార్థాలు** 2 టేబుల్ స్పూన్లు - చాకో చిప్స్ 100 గ్రా - వెన్న 1/2 కప్పు - పొడి చేసిన చక్కెర 1 కప్పు - మైదా పిండి

**చాకోచిప్ కుకీలు ఎలా తయారు చేయాలో చుద్దాం..**

ముందుగా ఒక గాజు గిన్నె తీసుకొని అందులో 100 గ్రాముల వెన్న వేసి మెత్తటి మిశ్రమంలా అయ్యే వరకు గిలకొట్టండి. అందులో అర కప్పు పొడిగా చేసిన చక్కెర కలపండి. దీనిని మెత్తగా కలపాలి. తరువాత ఇందులో ఒకటి పావు మైదా పిండిని జోడించండి. రుచికి సరిపడా ఉప్పు వేసి మరీ మెత్తగా, మరీ గట్టిగా కాకుండా మామూలుగా ఉండే పిండి ముద్దలా తయారు చేసుకోవాలి. 2 టేబుల్ స్పూన్ల చోకో-చిప్ కుకీలను వేసి పూర్తిగా కలపాలి. నాన్-స్టిక్ పాన్ తీసుకోని ఆయిల్ వేసి దానిపై వెన్న కాగితాన్ని ఉంచి మరోసారి నూనెతో తడపాలి. చేతులోకి కొద్దిగా పిండి ముద్దను తీసుకొని చిన్న బంతి లాగా చేసి అరచేతులతో దాన్ని కొంచెం వెడల్పు చేయాలి. పాన్‌లో సరిపోయేంతలా చిన్నగా చేసుకుని ప్రతి పిండి ముద్దకు మధ్యలో సరైన గ్యాప్ ఉంచాలి.ఇప్పుడు కుకీలకు కొద్దిగా చోకో-చిప్స్ జోడించండి. మీకు కావాలంటే కొంచెం ఎక్కువ వేసుకోండి. పాన్‌పై మూత పెట్టి తక్కువ మంటతో 10 నిమిషాల పాటు వేడి చేయండి. స్టవ్ కట్టేసి,గా పాన్‌పై మూత తీసి కుకీలు పూర్తిగా చల్లబడేదాకా ఆగండి. అంతే నోరూరించే టేస్టీ, క్రంచీ కుకీలు రెడీ.



# బరువు తగ్గే ప్లాన్ వేసుకుంటున్నారా? జాగ్రత్త, ఈ అపోహలు నమ్మొద్దు

**సోషల్ మీడియాలో టిప్స్ చూసి బరువు తగ్గే డైట్ ఫాలో అవుతున్నారా? అలా చేస్తే ప్రమాదంలో పడిపోతారు**

ఏ విషయం తెలుసుకోవాలనుకున్నా ఎక్కువ మంది ఫాలో అయ్యేది సోషల్ మీడియానే. ఇంటర్నెట్ అందుబాటులో ఉండటం వల్ల ప్రతిదీ సోషల్ మీడియాలో చూసి ఫాలో అయిపోతున్నారు. బరువు తగ్గాలనుకున్న వాళ్ళు కూడా ఇంటర్నెట్ లోనే మార్గాలు వెతుక్కుంటున్నారు. అయితే అవి కొంతమందికి ఉపయోగంగా ఉన్న మరికొంతమందికి మాత్రం తీవ్ర హాని కలిగిస్తాయి. ఎందుకంటే ప్రతీ ఒక్కరి శరీర విధానం ఒక్కోలా ఉంటుంది. వైద్యులు, పోషకాహార నిపుణులు, డైటీషియన్లు సలహా లేకుండా బరువు తగ్గడం కోసం డైట్ ఫాలో అయితే చిక్కుల్లో పడతారు. అందుకే ఏది నిజం, ఏది అపోహ అనే విషయం మీద స్పష్టమైన అవగాహన ఉండాలి. నిజానికి చాలా మంది తక్కువ కార్బ్ ఆహారం తీసుకుంటే బరువు తగ్గుతారని అనుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ఫాలో అవుతున్న డైట్ కీటో. ఇది కూడ సోషల్ మీడియా ద్వారానే వెలుగులోకి వచ్చింది. అయితే తక్కువ కార్బ్ ఆహారాలు తినడం అనేది అందరికీ సరిపోదు. కొంతమందికి తక్కువ కార్బ్ ఆహారం దీర్ఘకాలంలో శరీరానికి శాశ్వత నష్టాన్ని కలిగించవచ్చు. అందుకే ధాన్యాలు, బీన్స్, చిక్కుళ్ళు, పాల ఉత్పత్తులు, మాంసం, పండ్లు, కూరగాయలు వంటి అన్ని ఆహార సమూహాలతో కూడిన ఆహారాన్ని తినాలని పోషకాహార నిపుణులు సిఫార్సు చేస్తారు. వాస్తవం: బరువు తగ్గాలని అనుకున్నపుడు ఎక్కువ మంది చేసే పని కొన్ని ఆహారాలు తీసుకోకూడదని లిస్ట్ ప్రిపేర్ చేసుకుంటారు. అంతే కాదు డైట్ ఫాలో అవుతున్నప్పుడు శక్తి కోసం కాఫీ తాగమని సలహా ఇస్తారు. కాఫీ అనేది మెదడుకి మరింత చురుకుదనం కలిగించే ఒక పానీయం మాత్రమే. ఇది శరీరానికి ఎటువంటి పోషణ, శక్తి అందించదు. పైగా అతిగా కెఫీన్ తీసుకోవడం వల్ల శరీరానికి ఇతర అనారోగ్య సమస్యలు తీసుకొచ్చి పెడుతుంది. కెఫీన్ తీసుకోవడం వ్యసనంగా మారిపోతుంది. దీని వల్ల నిద్రలేమి పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంది. వాస్తవం: డిటాక్స్ వల్ల కాసేపు రీఫ్రెష్ గా ఉంటారు కానీ శరీరంలోని ద్రవాన్ని తగ్గిస్తుంది. దీని వల్ల డీహైడ్రేట్ కి గురి కావడం, మలబద్ధకం వంటి సమస్యలకు దారి తీస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. జీవక్రియ, కార్డియో వాస్కులర్ సమస్యలను క్లెన్సింగ్ లేదా డిటాక్స్ డైట్ పాటించడం వల్ల తగ్గించగలదని ఎటువంటి ఆధారాలు లేవు. వాస్తవం: కొన్ని మందుల కంపెనీలు తమ మార్కెట్ ను పెంచుకోవడం కోసం అలా చెప్తారు కానీ సప్లిమెంట్లు తీసుకోవడం వల్ల బరువు తగ్గుతారనేది పూర్తిగా అవాస్తవం అని నిపుణులు అంటున్నారు. సప్లిమెంట్స్ తీసుకుంటే బరువు అదుపులో ఉంటుందనేది చాలా అరుదుగా జరుగుతుంది. అందుకే బరువు తగ్గాలని అనుకున్నప్పుడు చేయాల్సిన మొదటి పని వైద్యులను కలిని సరైన డైట్ ఫాలో అవడం. సమతుల ఆహారం తీసుకుంటే తగినంత శారీరక శ్రమ కూడా ఉండటం చాలా ముఖ్యం. అప్పుడే అనుకున్న విధంగా బరువు తగ్గాలనే లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు.



# పెరుగు కంటే మజ్జిగ తీసుకోవడం మంచిదా? ఆయుర్వేద శాస్త్రం ఏం చెబుతోంది?

**పెరుగు తింటే ఎన్నో లాభాలు ఉన్నాయి. కానీ ఈ సమస్యలు ఉన్న వాళ్ళు పెరుగు తినకపోవడమే ఉత్తమం.**

పాలు, పెరుగు లేకుండా అసలు ఉండలేరు కొంతమంది. పాల నుంచి పెరుగు దాని నుంచి మజ్జిగ వచ్చినప్పటికీ మూడింటి మధ్య తేడాలు చాలా ఉన్నాయి. అవి అందించే పోషకాలు కూడా భిన్నంగా ఉంటాయి. కానీ చాలా మంది మాత్రం పెరుగు కంటే మజ్జిగ తీసుకోమని సూచించడానికి కారణం ఏంటి అంటే.. ఈ మూడు శరీరంలో ప్రతి స్పందించే విధానంలోని మార్పులే అందుకు కారణమని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. పెరుగులో మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇది వేడిని తాకినప్పుడు పులియబెడుతుంది. అది కడుపులోకి వచ్చినపుడు కూడా పొట్టలోని వేడి ఆమ్లాలు కారణంగా పులియబెట్టడం జరుగుతుంది. దాని వల్ల పేగులు వేడెక్కుతాయి. కానీ పెరుగు నుంచి వచ్చిన మజ్జిగ మాత్రం శరీరాన్ని చల్లబరుస్తుందని అంటారు. మజ్జిగ అన్ని రకాల శరీరాలకు, సీజన్లకు అనుకూలంగా ఉంటుంది. అందుకే పెరుగు కంటే మజ్జిగ చాలా ఆరోగ్యకరమైనదని స్పష్టం చేశారు. పెరుగు కొవ్వు, బలాన్ని పెంచుతాయి. వాత అసమతుల్యతను తగ్గించడంలో సహాయపడుతుంది. పెరుగుని అందరూ తినలేరు. ఊబకాయం, కఫ రుగ్మతలు, రక్తస్రావం, వాపు, రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఉన్న వాళ్ళు పెరుగుకి దూరంగా ఉండాలి. అంతే కాదు రాత్రిపూట పెరుగు తినకూడదని ఆయుర్వేద శాస్త్రం నొక్కి చెప్తుంది. ఎందుకంటే ఇది జలుబు, దగ్గు, సైనస్ లు ప్రేరేపిస్తుంది. ఒకవేళ రాత్రిపూట పెరుగు తినకుండా ఉండలేరని అనుకుంటే అందులో చిటికెడు మిరియాలు లేదా మెంతులు వేసుకుని తినడం అలవాటు చేసుకోవాలి. పెరుగుని వేడి చేయకూడదు. అందులోనీ మంచి బ్యాక్టీరియా నాశనం అవుతుంది. కొంతమంది పెరుగుని వేడి చేసి మజ్జిగ చారు వంటివి తయారు చేస్తారు. అయితే అది తరచూ తింటున్న వారి శరీరం మాత్రమే తట్టుకోగలదు. చర్మ రుగ్మతలు, పిత్త అసమతుల్యత, తలనొప్పి, నిద్రలేమి, జీర్ణ సమస్యలు ఉన్న వాళ్ళు పెరుగు తినకపోవడం మంచిది. అయితే పెరుగుకి బదులు దాని నుంచి వచ్చే మజ్జిగ ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి, పింక్ సాల్ట్, కొత్తిమీర వేసి తాగితే రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యాన్ని కాపాడుతుంది. వ్యాధులను నయం చేస్తుంది. జీర్ణక్రియని మెరుగుపరుస్తుంది. సులభంగా జీర్ణమవుతుంది. వాపు, జీర్ణ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు ఆకలి లేకపోవడం, రక్తహీనత సమస్యలను ని వా రి ం చ డ ం ల ో సహాయపడుతుంది. చలికాలంలో అయితే అజీర్ణం సమస్య రాకుండా నివారిస్తుంది. మజ్జిగ తేలికగా ఉండటం వల్ల జీర్ణం కావడం సులభం. ఆకలిని ప్రేరేపించడానికి సహాయపడుతుంది. అదే పెరుగు తీసుకుంటే జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. మలబద్ధకం, గ్యాస్ట్రిక్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ వంటి జీర్ణ సమస్యలు ఉంటే మజ్జిగ చక్కని ఎంపిక బరువు తగ్గేందుకు దోహదపడుతుంది. బరువు పెరగాలంటే పెరుగు తగ్గాలంటే మజ్జిగ ఎంచుకోవాలి. మజ్జిగ తేలికగా ఉండటం వల్ల శరీరానికి చల్లదనం ఇస్తుంది. వేడికి దూరంగా ఉంచుతుంది.





## అవి వదులుకోవడంతో కోట్లలో నష్టపోయిన
# సమంత..ఎందుకిలా జరిగింది..!

మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్న సమంత జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. నాగ చైతన్య నుండి విడాకులు తీసుకోవడం, ఆ తర్వాత మయోసైటిస్ బారిన పడడం, సినిమాలకి దూరం కావడం జరిగింది. మయోసైటిస్ తర్వాత సమంత జీవితం కుదుపులకి లోనైంది. సినిమాలు కాస్త తగ్గించిన సమంత సోషల్ మీడియాలో సందడి చేయడం, పలు ఇంటర్వ్యూలలో ఆసక్తికర విషయాలు తెలియజేడంతో హాట్ టాపిక్‌గా మారుతూ ఉంటుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. తాను 20 ఏళ్ల వయసులో ఇండస్ట్రీలో అడుగుపెట్టినట్లుగా చెప్పుకొచ్చింది. అప్పట్లో సక్సెస్ అంటే.. ఎన్ని ప్రాజెక్టలు చేశాం. ఎన్ని యాడ్స్ చేస్తున్నాం. ఎన్ని పెద్ద బ్రాండ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నామనే దానిపైనే ఉండేదన్నారు. అప్పట్లో పలు మల్టీ నేషనల్ బ్రాండ్స్‌కి కూడా అంబాసిడర్‌గా చెప్పిన సమంత.. ఉత్పత్తులను ప్రమోట్ చేసే సమయంలో ఎంతో బాధ్యతగా ఉండాలని తెలుసుకున్నానని చెప్పుకొచ్చింది.ఏడాదిలో 15 బ్రాండ్స్ వదులుకున్నానని , ఇప్పటికీ నాకు ఎన్నో ఆఫర్స్ వస్తుంటాయని, కాకపోతే అన్ని ఆఫర్లను నేను అంగీకరించనని సమంత కామెంట్లు చేశారు. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే తాను కొత్త బ్రాండ్స్‌కి ఓకే చెబుతానని అంటుంది. మయోసైటిస్ అనే ఆటోఇమ్యూన్ వ్యాధితో బాధపడుతూనే అప్పట్లో షూటింగ్స్ చేశానని పేర్కొంది సమంత. అది ఓ తీవ్రమైన అనుభవం.. కానీ ఇప్పుడు బలంగా ఉన్నానని చెప్పుకొచ్చారు. సమంత 'సిటడెల్: హనీ బన్నీ' తర్వాత 'రక్త్ బ్రహ్మాండ్' అనే యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఈ సినిమాకు రాహి అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటించనున్నట్లు వెల్లడించారు. ఇక సమంత నిర్మాతగా వ్యవహరించిన 'శుభం' సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఇటీవల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకోసం ఎక్కువ సమయం కేటాయిస్తుంది సమంత. సెల్ఫ్ లవ్, మహిళా సాధికారత, వ్యక్తిగత సంరక్షణ వంటి విషయాల్లో స్పష్టమైన అభిప్రాయాలతో తన అభిరుచులకు అనుగుణంగా జీవిస్తూ ఇన్‌స్టాలో పలు సందేశాలు అందిస్తూ వస్తుంది సామ్.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి



టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తిరుమల శ్రీవారిని దర్శించారు. వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబీకులతో వచ్చిన నటికి దేవస్థానం అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి.. శేషవస్త్రంతో సత్కరించి.. తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలువురు భక్తులు మీనాక్షితో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపించారు.మీనాక్షి సినిమాల విషయానికి వస్తే చివరిసారిగా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించింది. అనిల్ రావిపుడి దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీలో హీరోగా విక్టరీ వెంకటేశ్, ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కీలక పాత్రలు పోషించారు. సినిమా బాక్సాఫీస్ వద్ద భారీగా కలెక్షన్ రాబట్టింది. ప్రస్తుతం నవిన్ పొలిశెట్టి హీరోగా తెరకెక్కుతున్న అనగనగా ఒక రాజు మూవీలోనూ హీరోయిన్‌గా నటిస్తున్నది.

## విక్రమ్ తనయుడితో
# ఘాటు ముద్దు..

### – అనుపమ అతడితో ప్రేమలో ఉందటూ వార్తలు!



ఒకప్పుడు పద్దతిగా ఉండే అనుపమ.. ఇప్పుడు రూటు మార్చింది. సినిమాలలో కూడా రెచ్చిపోయి నటిస్తుంది. లిప్ లాక్‌ల విషయంలో కూడా తగ్గేదే లే అంటుంది. అయితే అనుపమకి సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఇంటర్నెట్ షేక్ చేస్తుంది. అనుపమ.. ఇప్పుడు విక్రమ్ తనయుడితో ధ్రువ్ తో డేటింగ్‌లో ఉందా అంటూ కొందరు నెట్టింట జోరుగా ప్రచారాలు చేస్తున్నారు. అందుకు కారణం ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఫోటోలో అనుపమ లాగా కనిపించే ఒక అమ్మాయి, ధ్రువ్ లాగా కనిపించే వ్యక్తిని ముద్దు పెట్టుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇది నిజంగా అనుపమ, ధృవ్‌నేనా అని కొందరు కామెంట్ చేస్తుండాగా, మరి కొందరు ఈ ఫొటో సినిమాలోనిదని అంటున్నారు.ధ్రువ్, అనుపమ కలిసి 'బైసన్' సినిమాలో నటిస్తు న్నారు. ఈ సినిమాలో అనుపమ.. ధ్రువ్‌కి ప్రేయసిగా నటిస్తోంది. ఈ క్రమంలోనే సిని మాకి సంబంధించిన ఫొటో లీక్ అయి ఉండ వచ్చని అంటున్నారు. మరి ఈ విషయంపై అనుపమ, ధ్రువ్, మూవీ టీం కానీ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా, అనుపమ పరమేశ్వరన్ తెలుగు చిత్ర సినిమాకు ఎంతో సుపరిచితం. తన రింగు రింగుల జుట్టుతో తెలుగు ప్రేక్షకులను మనసు దోచుకున్న ఈ మలయాళ ముద్దుగుమ్మ అ..ఆ.. సినిమాతో తెలుగు ప్రేక్షకలని ఎంతగానో ఆకట్టు కుంది. ఇక శతమానం భవతి సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకి మరింత దగ్గరైంది. ఉన్నది ఒక్కటే జిందగీ, హలో గురు ప్రేమ కోసమే, కార్తికే య2 వంటి బిగ్గెస్ట్ హిట్ చిత్రాల్లో కూడా నటించి అనుపమ మంచి పేరు సంపాదించుకుంది. ఇటీవల అవకా శాలు తగ్గడంతో కాస్త బోల్డ్‌గా నటిస్తుంది. సిద్దు జొన్న లగడ్డతో నటించిన టిల్లు స్క్వేర్ లో అను పమ రెచ్చిపోయింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డును బ్రేక్ చేసింది. అసలు ఈ సినిమాలో హీరోయిన్ అను పమనేనా ? అనేలాఈ అమ్మడు తన అందంచందాలతో అద రగొ ట్టింది. ఏది ఏమైన ఇప్పుడు అనుపమకి సం బంధించిన పోస్ట్ నెట్టిం ట వైరల్ అవుతుంది.

## నేను దెయ్యాన్ని కాదు..
# భయపడకండి..



పానిండియా స్థాయిలో సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తున్నది కన్నడ భామ రష్మిక మందన్నా. ప్రస్తుతం ఆమె చేతిలో అరడజనుకు పైగా సినిమాలున్నాయి. ఆచితూచి సినిమాలను ఎంచుకుంటూ అన్నీ భాషలనూ కవర్ చేసేస్తున్నది రష్మిక. ఆమె సినిమాల జాబితాను పరిశీలిస్తే.. వాటిలో ఆసక్తికరమైన సినిమా ఒకటుంది. ఆ సినిమానే 'థామా'. రష్మిక నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా ఇది. ఆదిత్య సర్పోత్థార్ దర్శకుడు. దినేష్ విజన్ హారర్ ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సినిమా ఇది. ఈ సినిమాలో రష్మిక పాత్ర గురించి బాలీవుడ్ మీడియాలో ఆసక్తికరమైన కథనాలు వినిపిస్తున్నాయి. ఇందులో ఆమె పాత్ర ఏ రీతిలో ఉంటుంది? ఆహార్యం ఎలా ఉంటుంది? అనే విషయాలపై చర్చలు నడుస్తున్నాయి. రష్మిక రిస్క్ తీసుకుంటుందా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో తన తాజా ఇంటర్వ్యూలో 'థామా'లోని తన పాత్ర గురించి మాట్లాడింది రష్మిక. 'రీసెంట్‌గా నైట్ షూట్ సన్నివేశాల్లో నటించాను. నా కెరీర్‌లో ఈ తరహా సినిమా చేయడం ప్రథమం. ఇందులో దెయ్యాన్ని నేనేనంటూ చాలామంది విడుదలకు ముందే భయపడుతున్నారు. కథనాలు కూడా వచ్చేస్తున్నాయ్. ఇందులో నేను భయపడేదాన్నే కానీ, భయపెట్టేదాన్ని కాదు.' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక.

## ఆ బాధ వర్ణనాతీతం

బాలీవుడ్ నటి నుష్రత్ బరుచా తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నది. 2019లో వచ్చిన 'డ్రీమ్ గర్ల్' సినిమా ఈ బాలీవుడ్ భామకు గుర్తింపు తెచ్చిపెట్టింది. అదే టీమ్ ఆ సినిమాకి సీక్వెల్‌గా 2023లో 'డ్రీమ్‌గర్ల్ 2'ను తెరకెక్కించారు. తొలిపార్ట్‌లో నటించిన వారంతా ఈ సీక్వెల్‌లోనూ నటించారు. ఒక్క నుష్రత్ బరుచా తప్ప.ఇది తన జీవితంలో ఎదురైన చేదు అనుభవంగా ఆమె అభివర్ణించారు. దీనిపై ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ' మా టీమ్ నిర్ణయం నన్నెంతో బాధించింది. 'డ్రీమ్ గర్ల్'లో నటించిన అందర్నీ సీక్వెల్లో తీసుకున్నారు.. నన్ను తప్ప. నా బదులు అనన్య పాండేను తీసుకున్నారు. ఈ విషయాన్నే జీర్ణించుకోలేకపోయా. అలా అని నేనేం యుద్ధానికి దిగలేదు. ఎందుకంటే పోరాటం చేసినంత మాత్రాన పరిస్థితులు మారవు. ఒకవేళ నిలదీస్తే.. 'నువ్వు అవసరం లేదు' అనే సమాధానం వస్తే.. ఇక ఆ బాధ వర్ణనాతీతం.



On behalf of Circulated and owned by Vutukuru Venkateswara Sarma, Door No.28/853, Kisan Nagar, Navalak Gardens Post, Dist- Nellore (AP). Printed at Sri Sindhuja Printers, Screens & Graphiscs, Door No.28/853, Kisan Nagar, Navalak Gardens Post, Dist- Nellore (AP). Editor : Vutukuru Venkateswara Sarma, Mob: 9491021199, RNI: APTEL/2012/48884, Email: editorsharpnews@gmail.com